ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 9440897445, 8074636674

మంగళవారం, 01 సెప్టెంబర్ 2026 | Tuesday 01 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 141 | Vol.No 28 Issue No .141 | www.visionandhra.in

## అందుబాటులోకి మూసారాంబాగ్ బ్రిడ్జ్

- ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

మిగతా2లో..



## కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ



న్యూఢిల్లీ,ఆగస్ట్31 : ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

## తెలంగాణ కోసం కష్టపడ్డ తననే గెంటేశారు

- శకుని పాత్ర పోషించిన వేముల ప్రశాంతరెడ్డి
- జీవితంలో ఎవరిని క్షమించినా ప్రశాంత్‌ను క్షమించను
- కాంగ్రెస్ అధికారంలోకి రాగేనే కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నం
- నాలుగేళ్లు ఇడి, సిబిఐ కేసులుతో జైలులో పెట్టారు
- నిప్పులా తిరిగి వచ్చానని భావోద్వేగానికి గురి
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత విమర్శలు



నిజామాబాద్,ఆగస్ట్31 : తెలంగాణ కోసం కష్టపడ్డ తనను అన్యాయంగా బయటకు గెంటేశారని, ఎంతో కష్టపడి పార్టీ అధికారంలోకి వచ్చేలా చేసిన సొంత పార్టీలోనే నాకు స్థానం లేకుండా పోయిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏ తప్పూ చేయకున్నా తిహార్ జైలులో పెట్టారని అన్నారు. తండ్రిని బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే మొదటి పాత్ర అని ఆమె

మిగతా2లో..

## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

- రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి
- పారిశ్రామిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు



మంగళగిరి, ఆగస్టు 31 : రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రకటన విడుదలయ్యింది. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా

మిగతా2లో..



# అప్పును నెత్తిన పెట్టిన కెసిఆర్

- పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ
- 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు
- మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు
- తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు
- అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- అంబర్‌పేట సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఆగస్ట్31 : తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం

మిగతా2లో..



## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

- ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కీలక ఒప్పందాలు
- 'తెలంగాణ రైజింగ్'కు మరో ముందడుగు

హైదరాబాద్,ఆగస్ట్31 : హైదరాబాద్‌ను దేశంలోనే అతి పెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం బ్రిటన్, అమెరికాలో పర్యటించింది. ఆగస్టు 19 నుంచి 29 వరకు జరిగిన ఈ పర్యటనలో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కీలక చర్చలు జరిగాయి. పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు సైతం కుదిరాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తదితర ఉన్నతస్థాయి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్,

మిగతా2లో..

## అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

- కెనడా దారుణమైన దుర్వినియోగదారు
- కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి
- ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు



వాషింగ్టన్,ఆగస్ట్31 : అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్

మిగతా2లో..

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలు

- త్వరలో జిల్లాలకు సేవల విస్తరణ
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్,ఆగస్ట్31 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆయా జిల్లాలకూ

మిగతా2లో..



## యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం



- బిజెపి కార్యాలయం రక్షణపై పోలీసుల నిర్లక్ష్యం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్,ఆగస్ట్31 :హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొడ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర

మిగతా2లో..

## ప్రశ్నార్థకంగా ఆడబిడ్డల భద్రత

- తుక్కుగూడ ఘటనే ఇందుకు నిదర్శనం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,ఆగస్ట్31 : తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. తుక్కుగూడలో నర్స్ హత్య ఘటనపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకే కాదని.. ప్రజల ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని

మిగతా2లో..



# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

- 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- 2028లో రెండోదశ పూర్తి... మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు
- మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం





మార్కాపురం, ఆగస్టు 31 ; మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు.

30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని

మిగతా2లో..

## ప్రశ్నార్థకంగా ఆడబిడ్డల భద్రత

ఆవేదన వ్యక్తం చేశారు. హత్య అనంతరం అత్యాచారం జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచకాలు పెరిగి, శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత దారుణంగా మారుతుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుందని హరీశ్ ప్రశ్నించారు. 'మహిళలకు భద్రత కల్పించలేని మీకు హోం శాఖ నిర్వహించే నైతిక హక్కు ఉందా? ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చేయాలి. రాష్ట్రంలో దిగజారుతున్న మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఃఖా పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు.

## అందుబాటులోకి మూసారాంబాగ్ బ్రిడ్జ్

హైదరాబాద్,ఆగస్ట్31 : మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సోమవారం ప్రారంభోత్సవం చేశారు. మూసీ నదిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పటిష్ఠంగా దీనిని నిర్మించారు. ఈ బ్రిడ్జితో అంబర్‌పేట, మూసారాంబాగ్ ప్రాంతాలకు ప్రయాణాలు సులభం కానున్నాయి. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, శ్రీ గణేశ్, నవీన్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో దిల్‌సుఖ్‌నగర్ నగర్ వెళ్లే ప్రయాణం సులువయ్యింది. ఇప్పటి వరకు గోల్‌నాక మీదుగా తిరిగి వెళ్లాల్సి వచ్చేది.

## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసి, పట్టణ ప్రజలు కాలుష్య ప్రభావానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీ సిటీ, పరవాడ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలాలు (రాఇజిలు) కూడా 33 శాతం పచ్చదనాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రివర్యులు పిలుపునిచ్చారు.

## అప్పును నెత్తిన పెట్టిన కెసిఆర్

తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సిఎం మాట్లాడారు. అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయిందన్నారు. కానీ తాము రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలన్నారు. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదని ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై కూడా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ బకాయిల రూపంలో రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లించామని తెలిపారు. కేసీఆర్ హయాంలో నిలిచిపోయిన పీఆర్సీని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధ రించామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రేవంత్ తెలిపారు. 32 నెలల్లో ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ఆర్టీసీకి ఆర్థిక నష్టం రాకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని వివరించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని సీఎం అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలల పాటు జీతాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు ఐదో తేదీకే జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసు పెంపు, రూ.8 వేల కోట్ల బకాయిల భారాన్ని కూడా గత ప్రభుత్వం తమపై వదిలి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు గత పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు.

## అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

## గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

తయారీ రంగాల్లో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం వేగంగా ఎదుగుతోంది. ఈ బలాన్ని మరింత పెంచేలా ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్? భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం. యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (÷ూక్షం÷ూ) ప్రతినిధులతో తెలంగాణ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం పెంచడం, బోధనా పద్ధతులను మెరుగుపరచడం, కొత్త తరహా తరగతి గది విధానాలను తీసుకురావడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సంస్థలు తమ బృందాలను హైదరాబాద్‌కు పంపించి ఇక్కడ విద్యా కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించాయి. తమ అధ్యాపకులు హైదరాబాద్‌లో ఉండి విద్యా కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నాయి. ÷-రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఈ కోర్సులను డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఓఎ÷ు), లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సీనియర్ అధ్యాపకులతో చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి. ÷-రిటన్, అమెరికా పర్యటన ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశమై పర్యటనలో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలను హైదరాబాద్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను త్రి-ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మా లక్ష్యానికి ఈ పర్యటన పెద్ద బలం ఇచ్చింది. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న మధ్యంతర లక్ష్యానికీ ఇది ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలతో ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు కుదరడం చాలా సంతోషంగా, గర్వంగా ఉంది. తెలంగాణ యువత, పిల్లలకే కాకుండా దేశంలోని విద్యార్థులకు కూడా ప్రపంచస్థాయి విద్య అందేలా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు నేనే నాయకత్వం వహిస్తాను' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదివి యువత ప్రపంచస్థాయిలో మంచి నిపుణులుగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాన్ని సాధించడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మెరికా పర్యటనలో తెలంగాణ బృందం నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ, వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధులతో సమావేశమైంది. ఈ చర్చల అనంతరం పలు కీలక ఒప్పందాలు పూర్తయ్యాయి. భవిష్యత్తులో మరిన్ని ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్జీనియా టెక్ తెలంగాణలో పరిశ్రమలకు అవసరమైన, భవిష్యత్తు ఉద్యోగాలకు ఉపయోగపడే విద్యా విధానాలను తీసుకురావడంపై సహకరించనుంది. ఃుద్యాశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పిల్లలు, యువతకు విద్య, నైపుణ్యాలు, క్రీడలను తన ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటిగా పెట్టుకున్నారు. నర్సరీ నుంచి కేజీ, ప్రాథమిక, హైస్కూల్ వరకు విద్యా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నైపుణ్య శిక్షణ, క్రీడా విద్యను కూడా బలోపేతం చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో భారీగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చుతున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇప్పటికే నాలెడ్జ్ ఎకానమీలో మంచి స్థానం సంపాదించిందన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో హైదరాబాద్ ముందుందని చెప్పారు. టెక్నాలజీ, ఇంజినీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూళ్లు, మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీల నుంచి మంచి విద్య పొందిన మానవ వనరులే హైదరాబాద్ అభివృద్ధికి ప్రధాన బలమన్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటైతే మరిన్ని గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, కంపెనీలు తెలంగాణకు వచ్చే అవకాశం ఉందన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కాలేజీల ద్వారా నైపుణ్యం కలిగిన బ్లూ కాలర్ ఉద్యోగులను తయారు చేస్తామని చెప్పారు. దీనివల్ల రాష్ట్రంలో తయారీ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల స్వల్పకాలిక కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను హైదరాబాద్‌లో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రపంచస్థాయి విద్యను అందించేందుకు ఇన్‌స్టిట్యూట్‌లోని తరగతి గదులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. నవంబర్ నుంచే హైదరాబాద్‌లోని ప్రజలు, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలు నిర్వహించే విద్యా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో భారత్ ఫ్యూచర్ సిటీలోనూ గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌కు అవసరమైన సదుపాయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఃసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచస్థాయి విద్యాసంస్థల కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ విద్యాసంస్థలు, క్రీడా సదుపాయాలు రాష్ట్ర అభివృద్ధిపై చూపే ప్రభావంపై ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశ్రమల రంగాల్లో ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. ఇప్పుడు విద్య, పరిశోధన, నైపుణ్యాల రంగాల్లోనూ అదే స్థాయి గుర్తింపు తీసుకురావాలన్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలు హైదరాబాద్‌లో అడుగుపెడితే తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి విద్య, నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయి. అదే సమయంలో కొత్త పెట్టుబడులు, కొత్త కంపెనీలు, కొత్త ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుంది. మూడు ట్రిలియన్ తెలంగాణ రైజింగ్ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. విద్య, నైపుణ్యం, పరిశోధన, పరిశ్రమలను కలిపి ముందుకు తీసుకెళ్లే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రయత్నం తెలంగాణ భవిష్యత్తుకు కొత్త బాట వేస్తోంది.

## భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం

వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీల నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర." అని ముఖ్యమంత్రి అభివర్ణించారు.

వెలిగొండకు 2019లో గ్రహణం.. 2024లో విముక్తి"

2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలి. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎందుకు ఇవ్వలేదు. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సీఎం వ్యాఖ్యానించారు. మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలువెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని, మహానది-గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వహించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

సంప్రదాయ పంచెకట్టుతో ఉల్లాసంగా..

తెలుగు సంప్రదాయ పంచె కట్టుతో వెలిగొండ సొరంగాల ద్వారా వచ్చిన కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చారు. కృష్ణా జలాలు పసుపు కుంకుమలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర జలాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులపై చల్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఫీడర్ కాలువ వద్ద కృష్ణమ్మ ప్రవాహానికి ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. సంప్రదాయ నృత్యాలతో కృష్ణా జలాలకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. బహిరంగ సభా వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంపుపై కండువా తిప్పుతూ రైతులకూ, ప్రజలకూ ముఖ్యమంత్రి అభివాదం చేశారు. దివంగత పూలసుబ్బయ్య కుటుంబ సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు పనిచేసిన అధికారులు, ఉద్యోగాలు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పి. నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు

## తెలంగాణ కోసం కష్టపడ్డ తననే గెంటేశారు

దుయ్యబట్టారు. ఆయన శకుని పాత్ర పోషించినట్లు ఆరోపించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో కవిత మాట్లాడుతూ కంటతడి పెట్టారు. హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కుమారుడిలా చూసుకుంటే.. ఆయన మా మధ్య చిచ్చుపెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో మాట్లాడారు. ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. నెల రోజులు అమెరికాలో ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారని ఆరోపించారు. ప్రశాంత్‌రెడ్డికి ప్రజా జీవితం లేదు. ఆయన బాల్కొండ నుంచి పారిపోవాలి. ప్రశాంత్‌రెడ్డి వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో ప్రయత్నం చేశా. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి ఎంతో కష్టపడ్డాను. అయితే వారందరూ నన్ను పరాజితురాలిని చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహాడ్ జైలులో పెట్టారు? నిజామాబాద్ జిల్లా కోడలిగా ఉద్యమం చేసిన నన్ను నాలుగేళ్లు ఈడీ, సీబీఐ వేధింపులకు గురిచేశాయి. చివరకు నేను ఏ తప్పు చేయలేదని తేలింది. నన్ను ఎందుకోసం పార్టీ నుంచి బహిష్కరించారు? తెలంగాణ రక్షణ సేన.. పదవుల కోసం పెట్టిన పార్టీ కాదు. కన్నీళ్లు పెట్టుకున్నానని నేను పిరికిదాన్ని అనుకోవద్దు అని కవిత చెప్పారు. ఈ గడ్డ బిడ్డగా ఇక్కడ మిమ్ములను చూడగానే భావోద్వేగంతో కన్నీళ్లు ఆగడం లేదన్నారు. కేసీఆర్ పెద్ద కొడుకుగా ప్రశాంత్ రెడ్డి చెప్పుకుంటారని.. కానీ, మహాభారతంలో శకుని వంటి వ్యక్తి ఆయనని మండిపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిందేనని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 'నిజామాబాద్ కోడలిగా ఇక్కడ పని చేశా. నాకు మళ్లీ ఒక అవకాశం ఇవ్వండి. మీరే నా ధైర్యం' అని కవిత అన్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే తాను ఎక్కడికైనా, ఏ పార్టీలోకైనా వెళ్లగలనని, కానీ ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. ఈ సందర్భంగా తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఎన్ని కేసులు పెట్టినా నేను తప్పు చేయలేదనే చెప్పా. నన్ను తీహార్ జైలులో ఎందుకు పెట్టారు?' అని కవిత ప్రశ్నించారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు కనికరం చూపకుండా పార్టీ నుంచి వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఉన్నాను కాబట్టే బాధతో కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. తనను పిరికిదాన్ని అనుకోవద్దని హెచ్చరించారు. జైలులో ఉన్న సమయంలో తన అత్తగారు అండగా నిలిచారని కవిత గుర్తు చేసుకున్నారు. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టుపైనా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరు అందలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, అప్పటి ఎమ్మెల్యేల ఆస్తులు పదేళ్లలో భారీగా పెరిగాయని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో చేసిందేమీ లేదని కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం నిద్రపోతోందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాల్లో తెలంగాణ రక్షణ సేన విజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. రాష్ట్రానికి రూ.2లక్షల కోట్ల ఆదాయం వస్తోందని, అందులో రూ.లక్ష కోట్లు కేటాయిస్తే ఉచిత విద్య, వైద్యం అమలు చేయవచ్చని అన్నారు. సామాజిక న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తమ కార్యకర్తలను బెదిరించే రోజులు పోయాయని కవిత చెప్పుకొచ్చారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని మాజీ మంత్రి కేటీఆర్ స్నేహితుడైన కోరుట్ల ఎమ్మెల్యే కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పైనా విమర్శలు గుప్పించారు. మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అర్వింద్ కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమవుతున్నాయని అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తికి ప్రజలు అవకాశం ఇవ్వాలని కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు.

## యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం

కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ ఆఫీస్‌పై చేసిన దాడిపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి ఆరా తీశారు. బీజేపీ ఆఫీస్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం చేసి, కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులను వివరణ కోరారు. తక్షణమే ఈ ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలు

దశలవారీగా ఐవీఎఫ్ సేవలు విస్తరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వైద్యశాఖ అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో ఏఆర్టీ, సరోగసీ చట్టాల అమలుపై కఠిన నిఘా ఉంచుతున్నట్లు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సెంటర్లను ఉపేక్షించబోమని హెచ్చరించారు. తెలంగాణలో 477 ఏఆర్టీ, సరోగసీ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించు కున్నట్లు మంత్రి దామోదర వెల్లడించారు. 379 ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు చేశామని చెప్పారు. 50 చోట్ల డీవియేషన్స్ గుర్తించామని తెలిపారు. 2 సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేశామని.. 9 సెంటర్ల అనుమతులు తాత్కాలికంగా రద్దు చేశామని చెప్పుకొచ్చారు. ఫెర్టిలిటీ సేవల పేరుతో రోగులపై అనవసర ఆర్థిక భారం వద్దని అన్నారు. గాంధీ, పేట్లబురుజు ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల పనితీరుపై మంత్రి సమీక్షించారు. రెండు ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్లలో 39,802 మందికి ఫెర్టిలిటీ సేవలు అందిస్తున్నట్లు మంత్రి దామోదర తెలిపారు. 545 ఐవీఎఫ్ కేసులు, 521 ఐయూఐ పక్రియలు పూర్తి చేసినట్లు వివరించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నుంచి జులై మధ్యలో హాస్పిటళ్లు, స్కానింగ్ సెంటర్లలో 2,600 తనిఖీలు నిర్వహించామని తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడే కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## హిమాలయమాల్లో వాటర్ బాంబ్స్ !

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు మరోసారి హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సులపై ఆందోళనలను పెంచాయి. ముఖ్యంగా భారత్ ఎగువన హిమాలయాల్లో హిమానీ నదాల పరిస్థితిపై ఆందోళన కలుగుతోంది. మనదేశంలో అలాంటి ఉపద్రవమే జరిగితే పలు రాష్ట్రాలు కొట్టుకుపోక తప్పదు. హిమానీనదాల కరిగే ప్రక్రియలో ఏర్పడే సరస్సుల్లో భారీ మొత్తంలో నీరు నిల్వ ఉంటుంది. వీటిని నియంత్రించే సహజ మంచు, రాళ్ల లేదా మట్టి అడ్డంకులు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది. భారీ వర్షాలు, హిమానీనదాల కరుగుదల, కొండచరియలు విరిగిపడటం, భూకంపాలు వంటి కారణాలతో సరస్సు అడ్డంకులు తెగిపోతే దిగువ ప్రాంతాలకు ఒక్కసారిగా భారీగా నీరు, బురద, రాళ్లు, మట్టి కొట్టుకురావచ్చు. అందుకే ప్రమాదకర హిమానీనద సరస్సులను నిపుణులు కొన్నిసార్లు 'వాటర్ బాంబ్స్'గా అభివర్ణిస్తారు. నేపాల్‌లో జరిగిన వరదలు హిమాలయ ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు ఎంత వేగంగా భారీ విపత్తులుగా మారగలవో మరోసారి చూపిస్తున్నాయి. ముఖ్యంగా హిమానీనద సరస్సుల సంఖ్య, వాటి నీటి నిల్వ సామర్థ్యం, వాతావరణ మార్పుల ప్రభావం, పర్వత ప్రాంతాల్లో పెరుగుతున్న నిర్మాణాలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. హిమాలయాల్లోని హిమానీనద సరస్సుల ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేస్తే, పర్వత ప్రాంతాలతో పాటు దిగువ మైదాన ప్రాంతాల్లోనూ భారీ వరదలు సంభవించే అవకాశం ఉంది. అందుకే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, ఉపగ్రహ పర్యవేక్షణ, ప్రమాద మ్యాపింగ్, శాస్త్రీయ ఇంజనీరింగ్ చర్యలు అత్యంత కీలకంగా మారుతున్నాయి. నేపాల్–టిబెట్ సరిహద్దులో హిమానీనదం విస్ఫోటనం కారణంగా భోటేకోశి, త్రిశూలి నదుల్లో భారీగా వరదలు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలు, టిబెట్‌లో నదీ మూల ప్రాంతానికి సమీపంలో



కొత్తగా తాత్కాలిక సరస్సు ఏర్పడటంతో భోటేకోశి నదిలో నీటిమట్టం మళ్లీ పెరిగినట్లు సమాచారం. దీంతో దిగువ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. నేపాల్‌లో జరిగిన ఈ ఘటనతో ఇప్పుడు భారత హిమాలయ ప్రాంతాల్లో ఉన్న హిమానీనద సరస్సుల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సీనియర్ సలహాదారు ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28,000 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారతదేశంలోనే ఉన్నట్లు అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే వీటిలో కొన్ని సరస్సులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్న సరస్సులుగా గుర్తించినట్లు సమాచారం. నేపాల్‌లోని ఘటనలో సహజ పరిస్థితులతో పాటు మానవ కార్యకలాపాలు కూడా నష్టాన్ని పెంచినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. టిబెట్, నేపాల్‌లోని పర్వత ప్రాంతాల్లో పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం, నదుల సహజ ప్రవాహ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పడటం వంటి కారణాలు ప్రమాద తీవ్రతను పెంచే అవకాశం ఉంది. అదేవిధంగా, ఇజీస చిజీనిజీనిజ ఆబిజీవ (ఇచా) సకాలంలో పనిచేయకపోతే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు తగినంత సమయం లభించదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. భారత హిమాలయ ప్రాంతంలోని ప్రమాదకర హిమానీనద సరస్సులు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. హిమాలయ ప్రాంతాల్లోని సరస్సులు పొంగిపొర్లితే ప్రభావం కేవలం పర్వత ప్రాంతాలకే పరిమితం కాకపోవచ్చు. భారీ మొత్తంలో నీరు, మట్టి, రాళ్లు దిగువకు ప్రవహించి నదుల నీటిమట్టాన్ని ఒక్కసారిగా పెంచవచ్చు. ప్రత్యేకంగా నేపాల్ లేదా సిక్కిం ప్రాంతాల్లో భారీ వరదలు సంభవిస్తే కోసి, గండక్, తీస్తా వంటి నదుల ద్వారా నీరు దిగువ మైదాన ప్రాంతాలకు చేరే ప్రమాదం ఉంటుంది. దీంతో ఉత్తర బీహార్‌లోని సుపాల్, సహర్సా, మధుబని, చంపారన్ వంటి ప్రాంతాలు, అలాగే ఉత్తర బెంగాల్‌లోని జల్పైగురి, సిలిగురి, డార్జిలింగ్ టెరాయ్ ప్రాంతాల్లో వరద ముప్పు పెరిగే అవకాశం ఉంది. ప్రమాదకర సరస్సులను పర్యవేక్షించేందుకు అధికారులు పలు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.ధిక ప్రమాదం ఉన్న సరస్సుల చుట్టూ ప్రమాద ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొత్త నిర్మాణాలు, నివాసాలను నియంత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరస్సుల్లోని నీటిని సురక్షితంగా బయటకు పంపేందుకు చెక్‌డ్యామ్‌లు, డ్రైనేజ్ వ్యవస్థలు, నీటి మళ్లింపు నిర్మాణాలు వంటి చర్యలను పరిశీలిస్తున్నారు.అధిక ప్రమాదం ఉన్న సరస్సుల్లో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్లను ఏర్పాటు చేసే ప్రణాళికలు ఉన్నాయి. నీటి మట్టం, ఉష్ణోగ్రత, ఇతర మార్పులను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. ఉపగ్రహ పర్యవేక్షణ ద్వారా సరస్సుల పరిమాణం, నీటి మట్టం, పరిసర ప్రాంతాల్లో మార్పులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిక ప్రమాదం ఉన్న హిమానీనద సరస్సుల వద్ద రాబోయే రెండేళ్లలో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇలాంటి వ్యవస్థలు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైతే ఖాళీ చేయించడం సులభమవుతుంది.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి ప్రధాన లక్ష్యం

**- ప్రజావాణిలో 67 దరఖాస్తుల స్వీకరణ**



కామారెడ్డిబ్యూరో ఆగస్టు 31(విజన్ఆంధ్ర): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని సత్వరమే పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 67 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందే ప్రతి వినతిపై నిర్లక్ష్యం లేకుండా స్పందించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారుల సమస్యలను పూర్తిగా తెలుసుకొని, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాండు, శిక్షణ కలెక్టర్ రవితేజ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**- నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక**



నారాయణపేట ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) :ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా గుర్తించిన అనామలీస్, నాన్–లింక్డ్ కేసులను నిబంధనల ప్రకారం పరిష్కరించి, ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా అనంతరం గుర్తించిన కేసులపై సమీక్షించారు. జిల్లాలో మండలాల వారీగా గుర్తించిన అనామలీస్, నాన్–లింక్డ్ కేసులు, జారీ చేసిన నోటీసులు, నోటీసులు అందించిన వారి వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల పూర్తి సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీలో అవసరమైన ఆధారాలతో హాజరయ్యేలా బీ ఎల్ వో లు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆమోదించబడిన డాక్యుమెంట్లలో ఏదైనా ఒకదాన్ని సమర్పించినప్పుడు, సంబంధిత పత్రాలను పరిశీలించి స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ ఉద్దేశం అర్హులైన ఓటర్లను తొలగించడం కాదని, అవసరమైన ఆధారాల ద్వారా వారి వివరాలను ధృవీకరించడమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. వివాహం, వలస, కుటుంబ వివరాల్లో మార్పులు, తల్లిదండ్రుల డాక్యుమెంట్లు అందుబాటులో లేకపోవడం వంటి ప్రత్యేక కేసులను నిబంధనల మేరకు పరిశీలించాలని తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో లింక్ చేసుకునే అవకాశం ఉన్న నాన్–లింక్డ్ కేసులను సంబంధిత వ్యక్తులకు తెలియజేసి వెంటనే పూర్తి చేయించాలని సూచించారు. ప్రతి బీ ఎల్ వో తమ పరిధిలోని కేసులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవసరమైన డాక్యుమెంట్లు మరియు కేసుల పురోగతితో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. క్లిష్టమైన కేసులను ప్రత్యేకంగా గుర్తించి, అవసరమైన సందర్భాల్లో ఉన్నతాధికారుల మార్గదర్శకాలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎన్నికల విభాగం అధికారిని జయసుధ, రాజకీయ పార్టీల ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, మహ్మద్ సలీం, రాఘవ చౌదరి, రాములు, వెంకట్రామ్ రెడ్డి, కెంచె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం పెంపొందించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31, (విజన్ ఆంధ్ర)జిల్లాలోని ప్రాథమిక విద్యార్థులలో పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లాలో ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమాల అమలును పరిశీలించడంలో భాగంగా ఆసిఫాబాద్ మండలంలోని జనకాపూర్ లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, బోధనా–అభ్యసన ప్రక్రియలు, విద్యార్థుల ప్రగతి అంశాలు, విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, సంఖ్యా పరిజ్ఞానం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను పరిశీలించి విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు అందిస్తున్న బోధన, విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న అభ్యసన కార్యకలాపాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో ఎఫ్.ఎల్.ఎన్. లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వినూత్న బోధనా పద్ధతులు అవలంబించాలని తెలిపారు. రీడింగ్ కార్నర్, లైబ్రరీ వినియోగం, విద్యార్థుల్లో పఠన అలవాట్లను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తన తరగతి స్థాయికి అనుగుణంగా చదవడం, చదివిన విషయాన్ని అర్థం చేసుకోవడం, స్పష్టంగా రాయడం, ప్రాథమిక సంఖ్యా పరిజ్ఞానం, గణిత నైపుణ్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత అభ్యసన స్థాయిలను గుర్తించి, అవసరమైన వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో– ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉమ బాల, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

### సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 31,(విజన్ ఆంధ్ర)మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డు (పాత వ్యవసాయ మార్కెట్ యార్డ్ )లో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెంట్రలైజ్డ్ కిచెన్ (కేంద్రీకృత వంటశాల) ను సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో అత్యాధునిక సాంకేతికత, పరిశుభ్రమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం అభినందనీయమైన కార్యక్రమం అని అన్నారు.ఏ బిడ్డ ఆకలితో బడికి వెళ్లకూడదన్నదే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ సంకల్పం అని, విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని పేర్కొన్నారు.మానవ వనరులే రాష్ట్ర సంపద అని, సానబెట్టిన వజ్రాల్లా ప్రతి విద్యార్థిని తీర్చిదిద్ది ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయికి తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.ఇంత మంచి కార్యక్రమం మంచిర్యాల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



కి, మంచిర్యాల ప్రజల తరఫున మరియు విద్యార్థుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య , హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, సభ్యులు,సింగరేణి సంస్థ అధికారులు, డీసీపీ భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య–మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ తూముల నరేష్, కార్పొరేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ను బహిష్కరించి వాయిదా వేసిన మున్సిపల్ చైర్ పర్సన్

### ముందుగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాలపై విచారణ

**ఆ తర్వాతనే కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించాలంటూ పాలక సభ్యుల ఆందోళన**



ఆదిలాబాద్ జిల్లా: (విజన్ ఆంధ్ర:బ్యూరో )ఆదిలాబాద్ ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో సభ్యుడు పాయల్ శంకర్ భూకబ్జాలపై విచారణ జరిపించిన తర్వాతనే మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించాలని వైస్ చైర్మన్ తో పాటు పాలక పక్ష కూటమి సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ లో కోఆప్షన్ ఎన్నిక సందర్భంగా కౌన్సిలర్లు బయటకు వచ్చి ఎన్నికను బహిష్కరించారు.స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఉన్న పాయల్ శంకర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ అసైండ్ భూములను కబ్జా చేసి తన భార్య పేరుతో ,అల్లుని పేరు మీద, కుటుంబ సభ్యుల పేరు మీద, బినామీల పేర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. బట్టి సావర్గం గ్రామ పరిధిలోని ప్రభుత్వ అసైండ్ భూమి సర్వే నంబర్ 72బి3 లో తన భార్య పేర 5 కోట్ల రూపాయల విలువ చేసే 15 ప్లాట్లు రిజిస్ట్రేషన్, ఇండస్ట్రియల్ కారిడార్ ప్రతిపాదిత ప్రాంతాలైన భోరజ్ మండలం హత్తిఘాట్, గూడ రాంపూర్ ,గిమ్మ గ్రామాల పరిధిలో దాదాపు 500 ఎకరాల భూముల్లో ఈడీ కంట్రోల్లో ఉన్నా కూడా వాటిని అమ్మివేసి అక్రమాలకు పాల్పడ్డారని పాలక కౌన్సిల్ సభ్యులు ఆరోపించారు. 500 ఎకరాలు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు బంధువులు బినామీలవే అన్న ఆరోపణలు.. పత్రికా కథనాలు ఇవే కాక మరిన్ని భూకబ్జా ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు.రిమ్స్ వెనకాల 2/3 సర్వే నెంబర్లు సుమారు 500 కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని అదేవిధంగా చిలుకూరి లక్ష్మీ గార్డెన్ మరియు రత్న గార్డెన్ మధ్యలు సుమారు 9 ఎకరాల ఫ్రీ ల్యాండ్ లో కబ్జాలో ఉన్నదని కోరడం జరిగింది. ఇవన్నీ పైన పూర్తి విచారణ జరిపించిన తర్వాతనే కోఆప్షన్ ఎలక్షన్లు వెళ్లాలని గౌరవ సభ్యులందరూ చైర్పర్సన్ పోడియం వద్దకు వచ్చి గొడవ చేయడం వల్ల బట్టి సభను మున్సిపల్ చైర్ పర్సన్ వాయిదా వేసి తదుపరి కార్యాచరణ ప్రభుత్వం దృష్టికి పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఐఎం , కాంగ్రెస్ , బిఆర్ఎస్ కౌన్సిలర్లు , ఫ్లోర్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

**-అదనపు కలెక్టర్లు సంగీత, పాండు**



సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు: 31(విజన్ ఆంధ్ర )ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాధానం అందించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియం హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యలను నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు సంబంధిత మండల స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు అందాయని, వీటిలో కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌లో 22, జహీరాబాద్ డివిజన్ 05, నారాయణఖేడ్ డివిజన్ 03 ఫిర్యాదులు, వినతులు అందగా, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదని తెలిపారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఆర్టీసీ, నిమ్జ్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, బీసీ అభివృద్ధి, సహకార, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, డీఆర్డీఏ, గ్రౌండ్ వాటర్, నీటిపారుదల, ఆర్‌సీఓ, కార్మిక, జిల్లా పరిషత్, మున్సిపల్, విద్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు–31(విజన్ ఆంధ్ర): అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ బి శ్రీరాములు తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఎలిగేడు మండలం కేంద్రానికి చెందిన రాజవ్వ తన ఇద్దరు కుమారులు తనను పోషించడం లేదని తన సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం దరఖాస్తు ఫార్వర్డ్ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన బి రజిత తను ఒకేషనల్ ఎఎన్ఎం పూర్తి చేశానని తనకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఎఎన్ఎం పోస్టు బెట్ సోర్సింగ్ ద్వారా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సాసైటీకి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం మీర్జాంపేట గ్రామానికి చెందిన పుల్లారు పద్మ తనకు వచ్చే ఒంటరి మహిళ పెన్షన్ నిలిపివేశారని తనకు ఒంటరి మహిళ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డీఆర్డీఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తనకు చెందిన 46 గుంటల భూమి పోతుందని, కానీ 47 గుంటలు పోతున్నట్లు రికార్డులలో తప్పుగా నమోదు చేశారని , దీనిని సవరించి తన గుంట భూమి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై చెత్త.. ప్రయాణికులకు ప్రాణ సంకటం



దహేగం ఆగస్టు 31(విజన్ ఆంధ్ర): కొమురం భీం జిల్లా దహేగం మండలంలోని బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా మారింది. బోర్లకుంట నుంచి రాళ్లగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై చెత్తాచెదారం పేరుకుపోయి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. పత్తి పంటకు వినియోగించే పురుగుమందుల ఖాళీ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను రోడ్డుపైనే పడేస్తున్నారు. దీంతో రహదారి పరిసరాలు చెత్తతో నిండిపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రోడ్డుపై పడివున్న ఖాళీ బాటిళ్లు ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. బైక్ టైర్లకు బాటిళ్లు అడ్డంగా తగిలితే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై చెత్త పేరుకుపోయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల కోసం ఇద్దరు కార్మికులు ప్రతిరోజూ పనిచేస్తున్నప్పటికీ చెత్త సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోని చెత్తను సేకరించి నిర్ణీత ప్రదేశానికి తరలించాల్సిన బాధ్యత గ్రామపంచాయతీపై ఉంది. అయితే రోడ్డుపైనే చెత్త పేరుకుపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెత్త కారణంగా రహదారి పరిసరాల్లో దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ప్రజలు చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో పాటు వాహనదారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డుపై చెత్త వేయకుండా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు సూచిస్తున్నారు. రహదారిపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్, గ్రామ కార్యదర్శి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులను సక్రమంగా వినియోగించి గ్రామంలోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు. రోడ్డుపై పేరుకుపోయిన మందుల బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను వెంటనే తొలగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. చిన్న నిర్లక్ష్యం కారణంగా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ముందుగానే అధికారులు స్పందించాలని అంటున్నారు. బోర్లకుంట--రాళ్లగూడెం రహదారిపై ప్రయాణించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.


## మలబార్‌లో 'నైరా' కలెక్షన్ ఆవిష్కరించిన నటి శ్రీనిధి శెట్టి



హైదరాబాద్, ఆగస్ట్ 31 (విజన్ ఆంధ్ర) : మలబార్ గోల్డ్, డైమండ్స్ సహజ రత్నాలతో రూపొందించిన నూతన ఆభరణాల కలెక్షన్ 'నైరా'ను హైదరాబాద్‌లో నటి, మోడల్ శ్రీనిధి శెట్టి చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పీ.అహమ్మద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో జరుగుతున్న జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్లో భాగంగా ఈ కలెక్షన్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 14 వరకు రత్నాభరణాలు, అన్‌కట్ జ్యువెలరీపై తయారీ ఛార్జీల్లో 25 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సాంప్రదాయ చిల్లై, పచ్చి కళతో స్ఫూర్తి పొందిన 'నైరా'లో బంగారం, సహజ రత్నాలను ఆధునిక డిజైన్లతో మేళవించినట్లు తెలిపారు. సహజ రత్నాలకు ఆధునిక డిజైన్, కళాత్మకతను జోడించడమే 'నైరా' లక్ష్యమని అన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 31,(విజన్ ఆంధ్ర)ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో అధికారులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణానికి చెందిన మోటూరి శ్రీనివాస్ లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన సిద్ధి మల్లేష్ తమకు చెందిన భూమి ఇతరుల పేరిట అక్రమంగా పట్టా మార్పు జరిగిందని, ఇట్టి పట్టా రద్దు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ళకు చెందిన ఆవుల వెంకటేశం తనకు గ్రామ శివారులో ఉన్న భూమికి పట్టాదారు పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చీకటి కిషోర్ కుమార్ గౌడ్ తమ గ్రామపంచాయతీలో మురుగు కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులతో సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనకై సంఘటితమౌదాం !!

**–ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి చంద్రకుమార్ పిలుపు**

**–సెప్టెంబర్ 19న జరిగే సభను విజయవంతం చేద్దాం**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): భారతదేశవ్యాప్తంగా మితిమీరిపోయి పెరుగుతున్నటువంటి అవినీతి నిర్మూలనకై ప్రతి పౌరుడు సంఘటితమై ముందుకు కదిలినప్పుడే సమాజంలో మార్పు వస్తుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి చంద్రకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ లో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక, జాగో నవ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి జస్టిస్ బి చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ బి చంద్రకుమార్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం వామపక్ష ప్రజాతంత్ర శక్తులు సామాజిక న్యాయం కోరేవారు లౌకికవాదులు అందరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ దేశానికి ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. దేశంలో వాతావరణ కాలుష్యం, ముఖ్యంగా గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, ఆహార పదార్థాల కల్తీ బాగా పెరిగిపోయి ప్రమాదకర స్థాయికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని, ధరలు పెరిగిపోయాయని, నిరుద్యోగం పెరిగిపోతున్నదని, వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్నదని వీటిని ప్రస్తుత పాలకవర్గాలు పరిష్కరించలేవని నిజమైన ప్రత్యామ్నాయం ఏర్పడాలని కోరే వారందరూ ఐక్యమైతే ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమల్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల జంతర్ మంతర్ లో యువత పెద్ద ఎత్తున నిరసనలో పాల్గొన్నారని పేపర్ లీకేజీలను వ్యతిరేకిస్తూ విద్యార్థులు, యువత రోడ్డు మీదికి వస్తున్నారని ఇటువంటి పరిస్థితుల్లో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్య సంఘటన అవసరమని తెలిపారు. ఈ సమావేశానికి జస్టిస్ బి చంద్రకుమార్ గారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, ప్రొఫెసర్ వెంకటదాస్, కోలా జనార్ధన్, విజయ్ కుమార్, హైమద్ అమిదుద్దీన్, విజయ్ (విజ్జు), ప్రొఫెసర్ మొయినుద్దీన్, రాములు రిటైర్ లెక్చరర్, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర బ్యూరో):రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా భూములను రైల్వే శాఖకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్రంలోని రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ, డబ్లింగ్ పనులు, భూసేకరణ, స్టేషన్ల ఆధునీకరణ, పనుల పురోగతి తదితర అంశాలపై సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్తో కలిసి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రధాన రైల్వే ప్రాజెక్టుల పురోగతి, పనులు పూర్తయ్యే అంచనా సమయం, స్టేషన్ల ఆధునీకరణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. రైల్వే ప్రాజెక్టుల విస్తరణకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత భూములను అప్పగించాలని సీఎస్ సూచించారు.ప్రతి పనికి స్పష్టమైన గడువును నిర్దేశించి, నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే.ఎస్.బీ. కుమారి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు 100 శాతం పాఠశాలలలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31,(విజన్ ఆంధ్ర)విద్యార్థులు 100 శాతం ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి లతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సి.ఆర్.పి. లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులు 100 శాతం ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు 100 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమాలు 627 పాఠశాలలలో అమలు చేయడం జరుగుతుందని, 1 నుండి 5 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 2వ తరగతి విద్యార్థులకు ప్రాథమిక దశలోనే తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులపై పట్టు సాధించేలా నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. విద్యార్థులకు కంప్యూటర్ తరగతులు నిర్వహించాలని, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్య, వారిలో ఉన్న పఠన శక్తిని పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు అందించాలని తెలిపారు. చాలా పాఠశాలలలో విద్యార్థుల శాతం తక్కువగా ఉంటుందని, విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమీ క్వాలిటీ కంట్రోల్ అధికారులు శ్రీనివాస్, అబిద్ అలీ, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, సి ఆర్ పి లు పాల్గొన్నారు.

## ర్యాగింగ్, వేధింపులకు దూరంగా ఉండాలి:

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




ఆదిలాబాద్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీకి చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు షి టీం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్, మహిళల భద్రత, సోషల్ మీడియా వేధింపులు, ఈవ్ టీజింగ్, రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని కష్టపడి చదవాలని, భవిష్యత్తును మార్చగలిగే ఏకైక ఆయుధం చదువు అని తెలిపారు. క్రమశిక్షణ, మంచి మిత్రుల సావాసం ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడతాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని సూచించారు. పాఠశాలలు, బస్టాండ్లు, సోషల్ మీడియా లేదా ఇతర ప్రాంతాల్లో ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా ధైర్యంగా ఎదురించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు.మహిళలు, విద్యార్థినులు ఎలాంటి సమస్య ఎదురైనా షి టీం అత్యవసర నెంబర్ 8712959953కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112ను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, డీఎండబ్ల్యూ కలీం, మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపల్స్ మాధురి, ఫహేమిద్, షి టీం సభ్యులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విముక్త జాతుల అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక చర్యలు ..జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31,(విజన్ ఆంధ్ర)జిల్లాలో విముక్త జాతుల ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విముక్త జాతుల దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విముక్త జాతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, వారికి గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేయడంతో పాటు పిల్లలకు విద్య, ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. బ్రిటిష్ వారి కాలంలో విముక్త జాతుల వారిని క్రిమినల్ ట్రైబ్స్ చట్టం తీసుకువచ్చి నిర్బంధించిందని, స్వాతంత్రం వచ్చిన తరువాత ఆ చట్టాన్ని ఎత్తివేసి డి-నోటిఫైడ్ ట్రైబ్స్ చట్టం తీసుకువచ్చి విముక్త జాతులుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. విముక్త జాతుల వారు తమ సాంప్రదాయ వృత్తులు, కళలు, జానపద ప్రదర్శనలు, జీవన విధానాలు తెలంగాణ సంస్కృతికి ఎంతో విలువైన సంపద అని సమాజానికి వారు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. మన సంస్కృతిని సజీవంగా ఉంచడంలో వారి పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. ప్రతి విద్యార్థికి విద్య, యువకులకు నైపుణ్యం, ఉపాధి, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన జీవితం అందించే విధంగా సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. విముక్త జాతుల సాంప్రదాయ కళలు, వృత్తులు, జానపద సంస్కృతిని కాపాడుకోవడానికి కృషి చేద్దామని, సమాజంలో అన్ని వర్గాల వారితో సమానంగా జీవించేలా వారి హక్కులను కాపాడుదామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నదీమ్, గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, విముక్త జాతుల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడు శ్రీ మహేంద్ర భట్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు31 (విజన్ ఆంధ్ర) ;-వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండల కేంద్రంలోని రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీ కవ్వంపల్లి సత్యనారాయణ మరియు వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజులి ఆదేశానుసారం, మరియు వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శీనన్న పిలుపుమేరకు సోమవారం పర్వతగిరి పోలీస్ స్టేషన్లో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నరుకుడు రవీందర్ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మరియు రాజ్యసభ సభ్యుడు మహేంద్ర భట్ పై పిటిషన్ ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారు హల్ద్వానీలో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించిన అనంతరం, బిజెపి-ఆర్ఎస్ఎస్ కు చెందిన కొందరు వ్యక్తులు ఆయన ప్రసంగించిన వేదికకు "శుద్ధీకరణ" చేశారు.ఈ "శుద్ధీకరణ" చర్య కేవలం అత్యంత ఖండనీయమైన, సిగ్గుచేటైన ఆలోచనకు ప్రతీక మాత్రమే కాదు, మన రాజ్యాంగాన్ని,ఎస్సీ ఎస్టీ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే కాకుండా, చట్టపరమైన నేరం కూడా.ఈ ఘటన జరిగి 20 రోజులు గడిచినా, గౌరవనీయ ప్రధానమంత్రి మోదీ , ఆయన ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రధానమంత్రి మోదీ కి నిజంగా మన దేశ రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే, ఉత్తరాఖండ్‌లో ఈ నేరానికి పాల్పడిన వారిపై ఎఫ్ ఐఆర్ నమోదు చేయించి, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకునేలా చూడాలి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిన్నింటి అనిల్ రావు, పర్వతగిరి గ్రామ చీదురు శంకర్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాసాని సుధాకర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లందాసు రంగయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బోట్ల కనకరాజు, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు కందికట్ల భాస్కర్, అన్నారం సర్పంచ్ మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేడ్ల సంతోష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, రావూరు ఉపసర్పంచ్ కొమ్ము రమేష్, చీదురు తిరుపతి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా లో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర




కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 31 (విజన్ఆంధ్ర) కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపినారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపినారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపినారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు హెచ్చరించారు.

## వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

మార్కాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం నాడు దోర్నాల మండలం గంటవానిపల్లెకు చేరుకున్నారు. జిల్లా నేతలు, అధికారులు సీఎం కు స్వాగతం పలికారు. తరువాత అయన వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ప్రారంభించారు. ఫీడర్ కెనాల్ గేట్లు ఎత్తి నీటిని నల్లమల సాగర్కు విడుదల చేసారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజలు... రైతులు.. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సభా ప్రాంగణంలో ఆకుపచ్చ కండువాలను గాల్లోకి తిప్పుతూ వెలిగొండ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా మహిళలు హర్షం వ్యక్తం చేసారు.

## అక్రమ మట్టి తవ్వకాలు పై రెవెన్యూ అధికారుల దాడి

మేడ్చల్ మల్కాజిగిరి : కీసర మండలం రాంపల్లి దాయారా సర్వేనెంబర్ 633లో గుట్టుచప్పుడు కాకుండా ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్,ఉఖా రమాకాంత్ తో కలిసి దాడులు నిర్వహించారు.సెలవ రోజు సైతం రెవెన్యూ అధికారులు దాడి చేసి మూడు లారీలను రెండు జెసిపి 210 హిట్టచీలను సీజ్ చేశారు. ఈ అక్రమ మట్టి తవ్వకాల వేనుక మెట్టు నరసింహ హస్తము ఉన్నట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. 633 సర్వే నెంబర్లు అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నటు వంటి వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చట్టపర్యమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

## క్యామ మల్లేష్ ను పరామర్శించిన ఎంపీ ఆర్ కృష్ణయ్య



ఎల్బీనగర్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం హిల్ కాలనీలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జీ క్యామ మల్లేష్ కురుమను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31,(విజన్ ఆంధ్ర)ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణం ఎల్లాగౌడ్ తోటకు చెందిన సూర పరమేశ్వర్ రావు తన పేరిట బోరిగం గ్రామ శివారులో గల పట్టా భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కౌటాల మండలం మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన షాలు తామి పాటేదార్ తనకు 80 శాతం దివ్యాంగత్వం పొందని, పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లింగాపూర్ మండలం పిట్ట తాండా గ్రామానికి చెందిన బోడ బాపూరావు తమ గ్రామంలో డి.ఎం.ఎఫ్.టి. నిధులలో పని చేసిన వాటి బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం తలోడి గ్రామానికి చెందిన టేకం శ్రీశైలం తనకు ఉపాధి కల్పనకు మీ-సేవ కేంద్రం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహేగాం మండలం చంద్ర పెల్లి గ్రామానికి చెందిన బద్ది శంకర్ తనకు సదరం ధృవపత్రం ఇప్పించి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం పరందోలి గ్రామానికి చెందిన రాథోడ్ పుష్పలత తమ ఘాట్ సెక్షన్ లో గ్రావల్ పని చేసిన వాటికి బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెజ్జూర్ మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన నాయిని సుశీల తాను శాశ్వత దివ్యాంగురాలిని అని, తనకు దివ్యంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ వీరభద్రీయ కుల సంఘం ప్రతినిధులు జిల్లాలోని సంచార జాతర వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం




కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో)ఆగష్టు 31కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఇద్దరు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం సోమవారంనాడు కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కమీషనరేటు కరీంనగర్ వన్ టౌన్ పోలీసు స్టేషన్ ఏఎస్సై ఖాజా ఫయాజుద్దీన్,కరీంనగర్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ ఖాజా పాషా పదవీ విరమణ పొందారు.?కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.సీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన ఇద్దరికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.?ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి, రిజర్వు ఇన్స్పెక్టర్ (సంక్షేమం) కిరణ్ కుమార్, కరీంనగర్ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ సతీష్, సెక్రటరీ ఎస్సై నరసింహారావు, ఉపాధ్యక్షులు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు ఎస్సై శ్రీ మామిడి సురేందర్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


## ఆర్టీసీకి శేఖర్ గౌడ్ కు ఘన సన్మానం



నారాయణపేట , ఆగస్టు31 (విజన్ ఆంధ్ర) నారాయణపేట ఆర్టీసీ డిపోలో కంట్రోలర్ శేఖర్ గౌడ్ అందించిన సేవలు అభినందనీయమని డిఎం రామ్మోహన్ అన్నారు. కంట్రోలర్ శేఖర్ గౌడ్ పదవి విరమణ సందర్భంగా డిపో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎం మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అంకితభావంతో అందించే సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఆయన అన్నారు. పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సుదీర్ఘ ప్రభుత్వ సేవను పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందుతున్న శేఖర్ గౌడ్ సేవలు అభినందనీయం అన్నారు. డిపోలో అవసరమైన సేవలను అందిస్తూ, తోటి సిబ్బంది సమస్యలను పరిష్కరించినప్పుడు కలిగే సంతృప్తి ప్రయోజనాలు వేగంగా అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతతో కలసి పనిచేశారని గుర్తు చేశారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని డిఎం ఆకాంక్షించారు. పదవి విరమణ పొందిన శేఖర్ గౌడ్ కు డిఎం తోపాటు సిబ్బంది ఆర్టీసీ కార్మికులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు.

## కొత్మీర్ దహేగం రహదారి ఎప్పుడు బాగుపడేను

### బురదమయమైన రోడ్డుతో ప్రజలు, విద్యార్థుల వాహనదారులు తీవ్ర అవస్థలు



దహేగం ఆగస్టు 31(విజన్ ఆంధ్ర): కొమురం భీం జిల్లా దహేగం మండలంలోని కొత్మీర్ నుంచి దహేగం వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. రహదారి పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలతో అవసరం తీరిందా? ఇక తమ సమస్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదా? అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి రహదారి మొత్తం బురదమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు బురద కష్టాలు ఏంటో ప్రత్యక్షంగా తెలుస్తున్నాయి. విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు వెళ్లే ఉపాధ్యాయులు సైతం ప్రతిరోజూ ఇదే బురద రోడ్డుపై ప్రయాణిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులు బురదలోనే నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు, ఉద్యోగులు కూడా ఈ రహదారి కారణంగా అవస్థలు పడుతున్నారు. అత్యవసర వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోగులు, వారి కుటుంబ సభ్యులకు సైతం సరైన రహదారి లేక ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రజలు దహేగం నుంచి కాగజ్‌నగర్‌కు రాకపోకలు సాగిస్తుండటంతో ఈ మార్గం అత్యంత రద్దీగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో రహదారి బురదమయంగా మారడంతో ప్రతి ఒక్కరికీ ప్రయాణం కష్టతరంగా మారింది. రహదారి పనులు నిలిచిపోవడానికి కారణం ఏమిటో అధికారులు ప్రజలకు వివరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంతకాలంగా సమస్య ఉన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. రహదారి పనుల విషయంలో ముడుపులు ముట్టాయా? అనే అనుమానాలు కూడా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు, ఉద్యోగులు, వాహనదారులు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సమస్య పరిష్కారం కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మా సమస్యలకు ఎవరు పరిష్కారం చూపుతారు? కొత్మీర్--దహేగం రహదారి ఎప్పుడు పూర్తవుతుంది? ఇకనైనా మేము ప్రశాంతంగా ప్రయాణించే రోజులు ఎప్పుడు వస్తాయి? అంటూ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గుంతలో కూర్చొని నిరసన..

### వ్యక్తిని తొలగించిన పోలీసులు

హైదరాబాద్ : ఇమ్లిబన్ పుట్లీబౌలి రహదారిపై దెబ్బతిన్న రోడ్డును నిరసిస్తూ ఓ వ్యక్తి భారీ గుంతలో కూర్చుని నిరసన వ్యక్తం చేసారు. దీంతో ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారుడిని పక్కకు తీసుకుపోయారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నిసార్లు అధికారులను కలిసిన ఫలితం లేదని వాపోయారు.

## ప్రజావాణిలో 70 ఫిర్యాదులు

### సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 31, ( విజన్ ఆంధ్ర ) : సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (70) ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 47, ఇతర శాఖలకు 23, మొత్తం 70 దరఖాస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## భక్తి మన బలం.. భద్రత మనందరి బాధ్యత

**-సురక్షితంగా, ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహిద్దాం**

**-మండపాల వద్ద సీసీ కెమెరాలు రాత్రివేళ నిఘా తప్పనిసరి**

**-విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తత అవసరం**

**-డీజేలకు అనుమతి లేదు**

**-వదంతులు, రెచ్చగొట్టే సందేశాలకు దూరంగా ఉండాలి**

**-గత సంవత్సరం విపత్తులో అందరి సహకారంతో బయటపడ్డాం**

**-పోలీస్ శాఖతో సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేద్దాం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**

**- గణేష్ మండలినిర్వాహకులు సూచించిన సలహాలను పరిశీలిస్తాం - అడిషనల్ కలెక్టర్ విక్టర్**





కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 31 (విజన్ఆంధ్ర)గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర గణేష్ మండలి ఎరువాకులను కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పోలీస్ శాఖ సూచనలు పాటించి శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు.కామారెడ్డి కళాభారతీ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, శోభాయాత్రలపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ ముకుంద రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.గతేడాది ఘటనలు పునరావృతం కాకూడదు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవడం కామారెడ్డి జిల్లా ప్రత్యేకత అని ఎస్పీ అన్నారు. గతేడాది మాచారెడ్డి మండలంలో గణేష్ విగ్రహాన్ని తరలించే సమయంలో విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి చెందగా, కామారెడ్డి ఇంద్రానగర్‌లో విగ్రహ తరలింపు సమయంలో ముగ్గురు గాయపడ్డారని గుర్తుచేశారు."గతేడాది జరిగిన విషాద ఘటనలు ఈసారి పునరావృతం కాకూడదు. ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా, ఎవరికీ గాయం కాకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలి" అని పిలుపునిచ్చారు.మండపాల భద్రత నిర్వాహకులదే కీలక బాధ్యత గణేష్ మండపాలను ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విగ్రహ పరిమాణానికి అనుగుణంగా స్టేజ్‌ను ఏర్పాటు చేయాలని, రహదారులను ఆక్రమించేలా భారీ స్టేజ్‌లు ఏర్పాటు చేయకూడదన్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేసి క్రమశిక్షణతో దర్శనం జరిగేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల భద్రత, దొంగతనాల నివారణ కోసం మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రివేళ నిర్వాహకులు లేదా సంబంధిత వ్యక్తులు మండపం వద్ద కాపలాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రతి మండపం వద్ద పోలీస్ పాయింట్ బుక్ ఏర్పాటు చేస్తామని, పోలీస్ సిబ్బంది తనిఖీకి వచ్చినప్పుడు వారి సూచనలు, తనిఖీ వివరాలను అందులో నమోదు చేయాలని చెప్పారు. విగ్రహాల రవాణాలో అప్రమత్తత విగ్రహాలను మండపాలకు తరలించే సమయంలో నిర్వాహకులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. విగ్రహం ఎత్తు, వాహనం ఎత్తు, రహదారిపై ఉన్న విద్యుత్ తీగల పరిస్థితిని ముందుగానే పరిశీలించాలని తెలిపారు.విద్యుత్ తీగలకు విగ్రహాలు తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే రవాణా చేయాలని, విగ్రహ పరిమాణానికి అనుగుణమైన వాహనాన్ని వినియోగించాలని సూచించారు. వేగం కంటే భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.విద్యుత్, అగ్ని ప్రమాదాలపై ప్రత్యేక జాగ్రత్తలు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండపాల్లో విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు, సౌండ్ సిస్టమ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలను సురక్షితంగా ఏర్పాటు చేయాలని సూచించారు. తడిగా ఉన్న ప్రదేశాల్లో విద్యుత్ పరికరాలను ఉపయోగించకూడదని, విద్యుత్ ఏర్పాట్లను నిపుణులచే చేయించుకోవాలని తెలిపారు. దీపాలు, ప్రమిదలు, కొవ్వొత్తులు ఏర్పాటు చేసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల సమీపంలో మండే వస్తువులు లేకుండా చూడాలని సూచించారు. అవసరమైన చోట ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఫైర్ బాల్స్ లేదా నీటి బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.డీజేలకు అనుమతి లేదు గణేష్ ఉత్సవాలను సాదాసీదాగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్పీ సూచించారు. డీజేలు, అనవసర ఆర్భాటాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకర కార్యక్రమాలు నిర్వహించడం, ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు లేదా పాటలు నిర్వహించడం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. - వదంతులను నమ్మొద్దు...సోషల్ మీడియా, వాట్సాప్ తదితర మాధ్యమాల్లో వచ్చే దురుద్దేశపూర్వక, రెచ్చగొట్టే సందేశాలు, వదంతులను నమ్మవద్దని ఎస్పీ కోరారు. అనుమానాస్పద సమాచారం అందితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు లేదా ఇతర అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలో పోలీసులకు సహకరించాలిగణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ కోరారు. ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.అన్నదాన కార్యక్రమాల వద్ద తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు, నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. - సమన్వయంతో విజయవంతం చేద్దాంపోలీస్ శాఖ, ఉత్సవ నిర్వాహకులు, యువత, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించవచ్చని ఎస్పీ తెలిపారు"ఈ సంవత్సరం మన పండుగలో ఆనందమే ఉండాలి.. విషాదానికి చోటు ఉండకూడదు. ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. భక్తి మన బలం.. భద్రత మనందరి బాధ్యత... అందరి సహకారంతో సురక్షిత గణేష్ ఉత్సవాలు మన సంకల్పం" అని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, పిలుపునిచ్చారు. -అడిషనల్ కలెక్టర్ విక్టర్ ...మండలి నిర్వాహకులు సూచించిన సూచనలు బాగున్నాయని జిల్లా స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలపై సమీక్షిస్తామని అడిషనల్ కలెక్టర్ విక్టర్ గణేష్ మండల్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు పార్టీల నాయకులు, గణేష్ మండలి నిర్వాహకులు, డీఎస్పీలు, సిఐలు, ఎస్సై లు, ట్రాఫిక్ పోలీసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల హాస్టల్స్ కు శంకుస్థాపన

హుస్నాబాద్ : హుస్నాబాద్ ఉమ్మాపూర్ లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల బాలుర ,బాలికల హాస్టల్స్ నూతన భవనాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసారు. ఒక్కో హాస్టల్ కి 7.28 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 14.56 కోట్ల రూపాయల వ్యయంతో హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ బాలుర ఓ బాలికల హాస్టల్ కి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వీసీ ఉమేష్ కుమార్ , రిజిస్ట్రార్ , ప్రిన్సిపల్ , కౌన్సిలర్ లు , మార్కెట్ కమిటీ చైర్మన్ లు , సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 64 ఫిర్యాదులు, ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) ఆగస్టు 31: ప్రజల నుంచి ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించే ఫిర్యాదులు, వినతులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రజల నుంచి నేరుగా 64, అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆయా సమస్యల స్వభావం, సంబంధిత శాఖలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హత కలిగిన సమస్యలను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని,అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుదారులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చెన్నయ్య, దేవ సహాయం, డీ.ఆర్.ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాలసూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

# స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

### ప్రజావాణికి 87 వినతుల స్వీకరణ

మహబూబ్ నగర్ ఆగస్ట్ 31(విజన్ ఆంధ్ర) ప్రజా వాణి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సత్వరం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని అధికారులు జాగ్రత్తగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, సంక్షేమం, వ్యవసాయం, ఎక్సైజ్, పౌరసరఫరాలు, భూ సర్వే--రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్లు--రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్య--ఆరోగ్యం, మైనింగ్, అటవీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 87 వినతులను అధికారులు స్వీకరించారు. అధికారులతో సమీక్ష సమావేశంప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన లక్ష్యాలను సమీక్షించుకుని, సాధించిన పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న



మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటి, వాటికి జియోట్యాగింగ్ చేయాలని, నాటిన మొక్కల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు శాఖల వారీగా నాటిన మొక్కల పురోగతి వివరాలను ఈ రోజు సాయంత్రంలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, వనమహోత్సవం, భూభారతి, ప్రజావాణి తదితర కార్యక్రమాల అమలుపై శాఖల వారీగా క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని సూచించారు.

ప్రతి జిల్లా అధికారికి కేటాయించిన మండలాలను స్పెషల్ ఆఫీసర్లుగా పర్యవేక్షించాలని, ఆయా మండలాల్లో క్రమం తప్పకుండా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవాలని అన్నారు. ఎం.పి.డి.ఓ లు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, ఎ.పి.ఎం లు, ఎ.పి.ఓ లు తదితర మండలస్థాయి అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, సమస్యలను గుర్తించి సాధ్యమైన మేరకు స్థానికంగానే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాల సాధనపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో వారానికొకసారి సమీక్ష నిర్వహించాలని తెలిపారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యం, ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలిన లక్ష్యం, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చించాలని అన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పనులకు సంబంధించి మండలాల వారీగా గ్రౌండింగ్ కానీ ఇళ్లను గుర్తించి, వాటి నిర్మాణం ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రయోజనాలు అందేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులను కూడా వేగవంతం చేయాలని అన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, అవసరమైన పనులను గుర్తించి ప్రారంభించాలని సూచించారు. ప్రజావాణి, ఆర్టీఐ దరఖాస్తులు, కోర్టు కేసులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సంబంధించిన అంశాలు తదితర పెండింగ్ వ్యవహారాలను అధికారులు క్రమం తప్పకుండా సమీక్షించుకోవాలని అన్నారు. ప్రతి శాఖలో పెండింగ్ అంశాలను గుర్తించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల పనితీరును ఎప్పటికప్పుడు విశ్లేషించుకుని, అవసరమైన చోట అంతర్‌శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పర్యటించి, ప్రభుత్వ కార్యక్రమాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. నిర్మల, జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర):ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలను ఓపికగా విన్నారు. ప్రజల నుంచి విద్య, వైద్య సదుపాయాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఆసరా పింఛన్లు, భూ సంబంధిత సమస్యలపై వినతిపత్రాలు అందాయి. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ అండ్ అకౌంట్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర రాజు పదవీ విరమణ సందర్భంగా ఆయన దంపతులను ఘనంగా సన్మానించారు. అలాగే 'పోషణ్ అభియాన్'లో భాగంగా 'పోషణ్ చర్చా యాప్' పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, డి.ఆర్.ఓ. స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరఘాట్ కు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 31,(విజన్ ఆంధ్ర) మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరంలో పుష్కర ఘాట్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు -2027లో భాగంగా జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో పుష్కర ఘాట్, గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి, రహదారుల విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. టైర్ 2 లో లక్షెట్టిపేటలో పుష్కర ఘాట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని, ఏర్పాట్లకు అవసరమైన నిధులు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని పుష్కర ఘాట్ల వద్ద సుమారు 6 లక్షల మంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.. పుష్కర ఘాట్ల ఏర్పాటుకు గాను ప్రభుత్వం 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ప్రజలకు అవసరమైన ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ ఈరోజు మంచిర్యాల జిల్లాలో చారిత్రాత్మకమైన ఘట్టాలు చోటు చేసుకున్నాయని, ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందించేందుకు సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించడం జరిగిందని, గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేసేందుకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాలలో రాష్ట్రంలో ప్రథమంగా శంకుస్థాపన చేయడం జరిగిందని, ఏర్పాట్లకు గాను 12 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, జిల్లాలోని మిగతా ఘాట్లకు 16 కోట్ల 70 లక్షల రూపాయలు, గూడెంలో పుష్కర ఘాట్ ఏర్పాటుకు 9 కోట్ల 50 లక్షల రూపాయలు, 58 కోట్ల రూపాయలతో గూడెంలోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం, మంచిర్యాలలోని శ్రీ విశ్వనాథ ఆలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు మూత్రశాలలు, బట్టలు మార్చుకునే గదులు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాదాపు 20 లక్షల నుండి 25 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలీస్, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31, (విజన్ ఆంధ్ర)జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా అవసరమైన చోట రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ లతో కలిసి రహదారి భద్రతపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సిర్పూర్ టి మండలంలోని వెంకట్రావుపేట వద్ద గల అంతర్రాష్ట్ర వంతెనపై భారీ వాహనాలు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రహదారి భవనాల శాఖల ఆధీనంలో గల రహదారుల మరమ్మత్తుల పనులు పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ రహదారుల శాఖ అధికారులు జిల్లాలోని జాతీయ రహదారులపై సిసి కెమెరాలు, వేగనియంత్రిక సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించాలని, రహదారులపై పశువులు సంచరించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా తనిఖీలు చేపట్టాలని, సీట్ బెల్ట్/ హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రహదారులు భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31,(విజన్ ఆంధ్ర)జిల్లాలో గ్రామపంచాయలు లేని గ్రామాల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి రీసర్వే ప్రక్రియ పురోగతిపై మండల సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేను జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని, ప్రక్రియ త్వరగా పూర్తిచేసేలా పనులను వేగవంతం చేయాలని తెలిపారు. భవిష్యత్తులో రైతుల మధ్య ఎలాంటి భూ వివాదాలు ఉండకూడదని, సర్వేలో డి.జి.పి.ఎస్., రోవర్స్ లను వినియోగించాలని తెలిపారు. లైసెన్సుడ్ సర్వేయర్ల సహకారం తీసుకోవాలని, సర్వే చేసే ముందు రోజు రైతులకు సమాచారం అందించి వారి సమక్షంలో సర్వే ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. సర్వే ప్రక్రియ ఉద్దేశాన్ని రైతులకు వివరించి ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. వినయ్ కుమార్, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31, (విజన్ ఆంధ్ర)జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ లతో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో గంజాయి విక్రయం, వినియోగంపై 3 కేసులు నమోదు చేయడం జరిగిందని, గంజాయి సాగు చేసిన 36 మంది రైతులకు రైతుబంధు నిలిపివేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు చేసే వారిని గుర్తించాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన చేపట్టాలని, విద్యాసంస్థల పరిధిలో 100 మీటర్ల లోపు పాన్, కిరాణా, బెల్ట్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలలలో చదివే విద్యార్థులకు మాదకద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే నష్టాలను వివరించాలని, ప్రతిరోజు విద్యార్థుల ప్రవర్తన గమనించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆటో, లారీల వాహన తనిఖీ నిర్వహించాలని, మెడికల్ దుకాణాలలో అధిక మోతాదులో మత్తుకు సంబంధించిన మందులను తనిఖీ చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి గంజాయి సాగు చేసే వారికి రైతుబంధు నిలిపివేస్తారని ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్య శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి మానసిక వైద్య నిపుణులు ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

### ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.



భూపాలపల్లి జిల్లా :31 ఆగస్ట్ (విజన్ ఆంధ్ర)భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 13 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## బట్టి సావర్గం గ్రామంలో "పోలీసులు మీకోసం" కార్యక్రమం

# 20 సీసీటీవీ కెమెరాల ప్రారంభం

**బట్టి సావర్గంలో 11, వాఘాపూర్ గ్రామంలో 9 సీసీటీవీ కెమెరాల ప్రారంభం**

**గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

**రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి**

**- హెల్మెట్ ధరించాలి**

**గ్రామాల భద్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి..**


**జిల్లా ఎస్పీ అఖిల్ మాహాజన్.**

ఆదిలాబాద్ విజన్ ఆంధ్ర బ్యూరో: ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను తెలుసుకోవడం, గ్రామాల్లో పోలీసు-ప్రజల మధ్య సత్సం బంధాలను బలోపేతం చేయడం, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా మావల మండలం బట్టి సావర్గం గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బట్టి సావర్గం గ్రామంలో ఏర్పాటు చేసిన 11 సీసీటీవీ కెమెరాలను, వాఘాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 9 సీసీటీవీ కెమెరాలను జిల్లా ఎస్పీ గ్రామ ప్రజలతో కలిసి ప్రారంభించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడంతో పాటు నేరాలకు పాల్పడే వ్యక్తులను త్వరితగతిన గుర్తించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాల భద్రత కోసం ప్రజలు ముందుకు వచ్చి సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సాగు, నిల్వ, రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ద్వారా ప్రమాదాలలో ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో ఎలాంటి నేరాలు జరిగినా, మహిళలు లేదా చిన్నారులకు సంబంధించిన సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్, బట్టి సావర్గం గ్రామ సర్పంచ్ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**కూల్చివేతకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడి..**

**ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేస్తే సహించేది లేదన్న తహసీల్దార్**



బోడుప్పల్, ఆగస్టు 31(విజన్ ఆంధ్ర):ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝళిపించారు. మేడిపల్లి మండలం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో సర్వే నంబర్లు 28 నుంచి 39 వరకు ఉన్న ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా కూల్చివేతలను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు తెలిసింది. కూల్చివేత చర్యలకు వెళ్లిన రెవెన్యూ అధికారిపై భౌతిక దాడి జరిగినట్లు సమాచారంప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలుప్రభుత్వ భూముల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని మేడిపల్లి తహసీల్దార్ వెంకట నర్సింహ్మా రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటమే రెవెన్యూ శాఖ బాధ్యత అని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. రెవెన్యూ అధికారులపై దాడికి పాల్పడిన ఘటనపై కూడా అధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం

## ఆధారాల పరిశీలన తర్వాతే నిర్ణయాలు

**-22ఏ ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించాలి**

**-అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**-ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి**

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-31(విజన్ ఆంధ్ర): 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన వ్యవహారాల్లో పూర్తి ఆధారాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూ రికార్డుల పరిశీలన, నిషేధిత జాబితాలో భూములను చేర్చడం, తొలగించడం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రైవేటు భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే.. సర్వే నంబరు వారీగా డిలీటెడ్ జాబితా రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

తొలగింపునకు స్పష్టమైన కారణాలు

22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ పాటించాలని కలెక్టర్ తెలిపారు. జాబితా నుంచి తొలగించే ప్రతి సర్వే నంబరుకు నిర్దిష్ట కారణాలు, స్పష్టమైన రిమార్కులు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అందుబాటులో ఉన్న అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ గంగయ్య, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎవరతడు..? అక్కడికెలా వచ్చాడు?

**- సుచిత్ర సమీపంలోని నిర్జన భవనంలో వ్యక్తి ఆత్మహత్య**



పేట్ బషీరాబాద్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): సుచిత్ర సమీపంలోని రాఘవేంద్ర కాలనీలో గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉదయం సుమారు 9.10 గంటలకు మనసా సరోవర్ గ్రీన్ హైట్స్ పాత భవనంలో ఓ వ్యక్తి ఉరేసుకున్నట్లు 100కు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఓ గదిలో సీలింగ్ ఫ్యాన్ కోసం ఏర్పాటు చేసిన రాడ్‌కు షర్టుతో ఉరేసుకుని ఉన్న వ్యక్తిని గుర్తించారు. భవనంలో గత కొన్నేళ్లుగా ఎవరూ నివసించడం లేదని వాచ్‌మెన్ పోలీసులకు తెలిపాడు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, నల్లటి జుట్టు, లేత నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చుట్టుపక్కల వారిని విచారించినా మృతుడిని ఎవరూ గుర్తించలేకపోయారు. మృతుడి ఆచూకీ లేదా వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే పేట్ బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. మృతుడి వివరాలు, ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గణేష్ ఉత్సవాలకు ప్రభుత్వశాఖల సహకారం అందించాలి - ఏఐఎంఐఎం



మంచిర్యాల టౌన్ ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) మంచిర్యాల గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలకు ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన సహకారం, సదుపాయాలు కల్పించాలని ఏ ఐ ఎం ఐ ఎం మంచిర్యాల జనరల్ సెక్రటరీ సయ్యద్ ఇబ్నీ అఫాన్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను కోరారు.మండపాల వద్ద ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది, నిమజ్జన మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, స్థానికంగా మొబైల్ ట్యాంకులు/బేబీ పాండ్లు, రాత్రివేళ పోలీస్ నైట్ పెట్రోలింగ్, నిమజ్జన రోజున ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం లేదా అదనపు ఛార్జీలు లేకుండా తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ భద్రతా తనిఖీలు, ఫైర్ ఎన్ ఓ సి ప్రక్రియను సులభతరం చేయడం, నిమజ్జన ప్రాంతాల్లో ఉచిత క్రేన్ల సదుపాయం కల్పించాను అని అన్నారు.ఉత్సవాలకు ముందుగానే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సయ్యద్ ఇబ్నీ అఫాన్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎం ఐ ఎం మంచిర్యాల పట్టణ అధ్యక్షులు మహమ్మద్ షాకీర్ అహ్మద్, మహమ్మద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.


# కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్

**- ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్ సస్పెన్షన్ ఉత్తర్వులు**

**- విచారణ వరకు అందుబాటులో ఉండాలి**

**- విద్యాధికారి రాజు వెల్లడి**



By Regd.Post, ack.due

PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER :: MEDAK DISTRICT
(Present: Sri S.Raju, M.A.,B.Ed.)

Rc.No:1976/A1/2026 Dated:31-08-2026

Sub: School Education – Adverse news published in Disha daily e-paper (Medak Edition) on 31.08.2026 with a caption "[illegible]" – Abuse and misconduct of Sri.M.Narsimlu,SA(Telugu), ZPHS Papannapet(V & M), Medak District – Suspension from service – Orders – Issued.

Ref: 1. Adverse news published in Disha daily e-paper (Medak Edition) on 31.08.2026.
2. Lr.No:664/EO/2026, Dated:29.08.2026 of the District Welfare Officer(FAC) Medak.

--oOo--

Where as it has come to the notice of the undersigned who is the Competent Authority (Appointing Authority) that, Sri.M.Narsimlu,SA(Telugu), ZPHS Papannapet(V & M), Medak District has abused and misconduct, used unparliamentary language against the girl students, which reflects his indiscipline attitude and negligence in discharging his legitimate which is grave irregularity and he is liable for action under Rule 3 of TCS(Conduct) Rules 1964 as per the report submitted by the DWO Medak vide reference 2nd read above.

And where as the undersigned (Appointing Authority) after careful consideration of the available material and having due regard to the circumstances of the case are satisfied that it is necessary to place Sri.M.Narsimlu,SA(Telugu), ZPHS Papannapet(V & M), Medak District under suspension from service with immediate effect.

Now therefore, in the exercise of the powers conferred by sub-rule (1) of Rule 8 Telangana Civil Services (CCA) Rules 1991 the undersigned (Appointing Authority) hereby placed the said Sri.M.Narsimlu,SA(Telugu), ZPHS Papannapet(V & M), Medak District under suspension from service with immediate effect and he shall continue to be under suspension until the conclusion of the disciplinary proceedings/ termination of all the proceedings relating to the matter.

It is further ordered that, during the suspension period of these orders remains in force the head quarters of Sri.M.Narsimlu,SA(Telugu), ZPHS Papannapet(V & M), Medak District shall be at ZPHS Papannapet (V & M), Medak District and he shall not leave the Head Quarters without obtaining the prior permission of the undersigned.

It is further ordered that during period of suspension Sri.M.Narsimlu,SA(Telugu), ZPHS Papannapet(V & M), Medak District shall be paid suspension allowance equalling to the leave salary on Half Pay Leave, the DA and other compensatory allowances shall be paid along with substance allowances. The quantum of substance allowance will be reviewed and revised in terms of FR 53(i) after 6 months pending review shall be continued to draw the substance allowance now sanctioned.

Receipt of the proceedings should be acknowledged.

S.Raju
Dist. Educational Officer(FAC)
Medak District

To,
Sri.M.Narsimlu,SA(Telugu), ZPHS Papannapet(V & M), Medak District
Copy to the Headmaster, ZPHS Papannapet (V & M), Medak district.
Copy to Mandal Educational Officer, Papannapet, Medak District.
Copy to the STO concerned.
Copy to the District Welfare Officer Medak for kind information.
Copy submitted to the Collector & District Magistrate Medak for kind information.



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర ఆగస్టు 31: దేశ భవిష్యత్తు విద్యార్థుల. చేతుల్లో ఉంటుంది విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం తో పాటు వెకిలి చేష్టలు చేసిన తెలుగు ఉపాధ్యాయుడు నర్సింలు ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి రాజు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా శాఖ కే మచ్చ తెచ్చే విధంగా వ్యవహరించిన తీరు పై జిల్లా అధికారి రాజు స్పందించారు. ఇరవై రోజుల క్రితం విద్యార్థులు చైల్డ్ హెల్ప్ లైన్స్ కు ఫిర్యాదు చేస్తే అధికారులు చర్యలు తీసుకోవడం లో జరిగిన తీవ్ర జాప్యం పై విమర్శలు ఉన్నాయి. విచారణ ఇంకా కొనసాగుతుందని, అప్పటి వరకు సదరు తెలుగు ఉపాధ్యాయుడు నర్సింలు హెడ్ క్వార్టర్ లోనే ఉండాలని ఆదేశించారు. వెకిలి చేష్టల ఉపాధ్యాయుడు సస్పెండ్ కావడం పై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం.. అధికారుల మౌనం ఎందుకు?

**- ఫిర్యాదు చేసి నెల రోజులు.. చర్యలు శూన్యం**

**- టౌన్ ప్లానింగ్ అధికారులతో స్థల తనిఖీ చేయించాలని డిమాండ్**

**- మున్సిపల్ కమిషనర్‌కు ఎం. ఐలేష్ ఫిర్యాదు**

హనుమకొండ. జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 ( విజన్ ఆంధ్ర ) : జీడబ్ల్యూఎంసీ పరిధిలోని వడ్డెరబస్తీ, జయ కాలేజీ సమీపంలోని హనుమకొండ పద్మాక్షి దేవాలయం వద్ద ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే నంబర్ 876లో సుమారు 180 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో గోడ, గది నిర్మించినట్లు ఆరోపిస్తూ హనుమకొండకు చెందిన ఎం. ఐలేష్ మున్సిపల్ కమిషనర్‌కు నెల రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ భూమి పేద ప్రజలకు ప్రభుత్వం కేటాయించిన భూమిగా ఉందని, దీనికి సంబంధించిన ప్రభుత్వ ఫైల్ నంబర్లు కూడా ఉన్నాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైన భార్యాభర్తలు మున్సిపల్ అధికారుల నుంచి అవసరమైన అనుమతులు పొందకుండానే నిర్మాణం చేపట్టినట్లు ఆయన ఆరోపించారు. అలాగే ప్రభుత్వం కేటాయించిన భూమిని నిబంధనలకు విరుద్ధంగా మూడో వ్యక్తులకు బదలాయించారా? అనధికారికంగా వినియోగిస్తున్నారా? అనే అంశాలను కూడా అధికారులు విచారించాలని కోరారు. స్థలాన్ని తనిఖీ చేయాలి సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు ఉన్నాయా లేదా, భూమి స్వరూపం ఏమిటి, నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా ఉందా అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఐలేష్ డిమాండ్ చేశారు. నిర్మాణం అనధికారికంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారిస్తే మున్సిపల్ చట్టాలు, భవన నిర్మాణ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు. ఇప్పటికైనా స్పందించాలి ఫిర్యాదు చేసి నెల రోజులు గడిచినా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఎం. ఐలేష్ ఆరోపించారు. ప్రభుత్వ భూమి విషయంలో వచ్చిన ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి, స్థలాన్ని తనిఖీ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. అక్రమ నిర్మాణం ఉన్నట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విజన్ ఆంధ్ర ప్రభావం..

# చిన్నారికి సురక్షిత ఆశ్రయం..!

**- కథనంపై అధికారుల తక్షణ స్పందన..**

**- సెలవు రోజైనా కదిలిన బాలల సంక్షేమ యంత్రాంగం**

**- సీడబ్ల్యూసీ ఆదేశాలతో అమీర్‌పేట శిశువిహార్‌లో చిన్నారి చేరిక**

**- చిన్నారి, తల్లిని సఖి కేంద్రానికి తరలించిన అధికారులు**

**- తల్లికి కౌన్సెలింగ్ అనంతరం కీలక నిర్ణయం**

**- చిన్నారి భద్రతకు తొలి ప్రాధాన్యం**

## విజన్ ఆంధ్ర పత్రిక కథనంతో క్షేత్రస్థాయిలో స్పందించిన అధికారులు




పేట్‌బషీరాబాద్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): చిన్నారిని ఇంట్లో ఒంటరిగా ఉంచుతున్నారనే అంశంపై విజన్ ఆంధ్ర దినపత్రికలో ప్రచురితమైన కథనంపై బాలల సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించారు. సెలవు రోజైన ఆదివారం సైతం క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి చిన్నారి, ఆమె తల్లిని సఖి కేంద్రానికి తరలించిన అధికారులు.. అనంతరం సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు ఐదేళ్ల చిన్నారి ఎ. ఇషికను అమీర్‌పేటలోని శిశువిహార్‌లో చేర్పించారు.

ఆగస్టు 30న విజన్ ఆంధ్ర పేజీ3లో ప్రచురితమైన కథనం అధికారుల దృష్టికి వెళ్లడంతో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డీసీపీవో) ఇంతియాజ్ రహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ ఏ.ఎం. రాజారెడ్డి, జిల్లా మహిళాశిశు సంక్షేమ అధికారి శారద సమన్వయంతో సీడబ్ల్యూసీ అధికారి సతీష్ తదితర సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపించారు. పేట్‌బషీరాబాద్ పోలీసుల సహకారంతో చిన్నారి, ఆమె తల్లిని అల్వాల్‌లోని సఖి కేంద్రానికి తరలించి పరిస్థితులను పరిశీలించారు.

**సీడబ్ల్యూసీ ఆదేశాలతో శిశువిహార్‌లో చేరిక**

చిన్నారి, ఆమె తల్లి పరిస్థితులను పరిశీలించిన అనంతరం సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచారు. చిన్నారి భద్రత, సంరక్షణ, కుటుంబ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు ఐదేళ్ల ఎ. ఇషికను అమీర్‌పేటలోని శిశువిహార్‌లో చేర్పించారు.

చిన్నారికి ప్రస్తుతం సురక్షితమైన వాతావరణంలో సంరక్షణ అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. శిశువిహార్‌లో చిన్నారికి అవసరమైన సంరక్షణ, రక్షణ, వసతులు కల్పించనున్నారు.

తల్లికి కౌన్సెలింగ్

చిన్నారి తల్లికి అవసరమైన కౌన్సెలింగ్ అందిస్తూ కుటుంబ పరిస్థితులు, చిన్నారి సంరక్షణకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. చిన్నారి భవిష్యత్ సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకుని సీడబ్ల్యూసీ తదుపరి చర్యలు చేపట్టనుంది.

**విజన్ ఆంధ్ర కథనంపై స్పందన**

చిన్నారి సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన విజన్ ఆంధ్ర కథనంపై అధికారులు వెంటనే స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివారం సెలవు రోజైనా సంబంధిత సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపించి, చిన్నారితల్లిని సఖి కేంద్రానికి తరలించడం, అనంతరం సీడబ్ల్యూసీ ఆదేశాలతో చిన్నారిని శిశువిహార్‌లో చేర్పించడం ద్వారా బాలల భద్రతకు అధికారులు ఇస్తున్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేసింది.” చిన్నారి ఎ. ఇషిక ప్రస్తుతం అమీర్‌పేట శిశువిహార్‌లో సురక్షిత సంరక్షణలో ఉన్నట్లు సంబంధిత అధికారులు సమాచారం అందించారు.

# శివారులోని గల్లీగల్లీలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తా

**- అభివృద్ధిలో కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం**
**- కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తెస్తున్నా**
**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో)30 ఆగస్ట్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో గల్లీగల్లీలోనూ నూతనంగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నందున కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మోడల్ రోడ్లు, స్కై వాక్, జంక్షన్ల అభివృద్ధి, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, వాటర్ డ్రెయిన్స్ నిర్మాణం వంటి వాటితోతోపాటు అభివృద్ధిలో కరీంనగర్ ను తెలుగు రాష్ట్రాల్లోనే ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దబోతున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం గత ఏడేళ్లలో రూ.22 వేల కోట్లకుపైగా నిధులను ఖర్చు చేసినట్లు వివరించారు.ఈరోజు ఉదయం కరీంనగర్ లోని 45వ డివిజన్ మంకమ్మతోట ఎమ్మెల్సీ గోపాల్ రావు బిల్డింగ్ సమీపంలో రూ.70 లక్షల యూఐడీఎఫ్ నిధుల అంచనా వ్యయంతో డ్రెయిన్ పైప్ లైన్, సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిసనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లు, పలువురు బీజేపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులోని ముఖ్యాంశాలు.కరీంనగర్ కార్పొరేషన్ ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కసితో పనిచేస్తున్నా. అందులో భాగంగా కేంద్రం నుండి రూ.50 కోట్ల యూఐడీఎఫ్ నిధులు తీసుకొచ్చినం. ఇవిగాకుండా మరో రూ.30 కోట్లు వచ్చే అవకాశముంది.దీంతోపాటు కేంద్ర పెద్దలను ఒప్పించి యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ ను చేర్చించి రూ.840 కోట్లు నిధులు తీసుకొచ్చినం. ఆయా నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలను మార్చబోతున్నాం. రూ.630 కోట్లతో కరీంనగర్ లో 40 పీట్లు అంతకంటే ఎక్కువ మోడల్ రోడ్లను 50 కి.మీల మేరకు నిర్మించబోతున్నం. దీంతోపాటు జిల్లా కోర్టు, సివిల్ ఆసుపత్రి, గీతాభవన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తాం. కరీంనగర్ బస్ స్టేషన్ వద్ద స్కై వాక్ (హైదరాబాద్ ఉప్పల్ తరహాలో) ను నిర్మిస్తాం. నగరంలోని ట్రాఫిక్ జంక్షన్లను గుర్తించి వాటిని కూడా సుందరంగా అభివృద్ధి చేస్తాం. దీంతోపాటు 130 ఎలక్ట్రిక్ వాహనాలను కూడా కొనుగోలు చేసి నగరంలో కాలుష్య రహిత రవాణా సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నాం.నగరంలో చిన్నపాటి వర్షానికే అక్కడక్కడా రోడ్లపై నీరు చేరి ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నందున ఆ సమస్య పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో వర్షపు నీటిని తరలించేందుకు మొత్తం 80 కిలోమీటర్ల పొడవునా డ్రైనేజీ కాలువలను ( స్టార్మ్ వాటర్ డ్రైన్) నిర్మించి అభివృద్ధి చేసేందుకు రూపొందించేందుకు ప్రతిపాదనలను రూపొందించాం. కరీంనగర్ లో ప్రధాన సమస్యగా మారిన డంపింగ్ యార్డ్ అంశం శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. రూ.80 కోట్లతో డంపింగ్ యార్డ్ శాశ్వత పరిష్కారానికి సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రతిపాదనలు రూపొందించినం. నగరంలో ఉత్పత్తయ్యే చెత్తను సేకరించి ప్రాసెసింగ్ కేంద్రంలో వేరు చేసి, రీసైకిల్ చేసి శాస్త్రీయంగా పారవేయడం కోసం “ఘన వ్యర్థాల సమగ్ర నిర్వహణ ప్రాజెక్టు బదిలీ కేంద్రం, ప్రాసెసింగ్ యూనిట్” ను ఏర్పాటు చేయబోతున్నాం. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని కరీంనగర్ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని.అందుకోసం ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని కోరారు.

# విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

**- నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక.**



నారాయణపేట, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులకు చిన్ననాటి నుంచే డబ్బు వినియోగం, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక ప్రణాళిక వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు.సోమవారం జిల్లా కేంద్రం లోని ఎర్ర గుట్ట వద్ద గల గురుకుల బాలికల పాఠశాలలో స్వత: పాండేషన్ సౌజన్యంతో జిల్లాలోని ఎంఈవో, హెచ్ ఎం లకు ఫైనాన్స్ లిటరసీ, మనీ మంత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమానికి జిల్లాలోని 88 ప్రాథమికోన్నత పాఠశాలలు, ఎంపిక కావడం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా గొప్ప అవకాశమన్నారు. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, సంపాదించిన డబ్బును సక్రమంగా పొదుపు చేయడం, సరైన విధంగా పెట్టుబడి పెట్టడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవడం అంతకంటే ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా, టెక్నాలజీ ద్వారా త్వరగా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆకర్షణీయమైన ప్రకటనలు, తప్పుడు పెట్టుబడి పద్ధతులు విద్యార్థులు, యువతను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. అత్యాశకు లోనై ఆర్థికంగా నష్టపోయి, సమస్యలను ఎదుర్కొంటున్న ఘటనలు మనం చూస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను నివారించేందుకు విద్యార్థులకు ఆర్థిక విషయాలపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల స్థాయిలోనే ఆర్థిక అక్షరాస్యతను సాధారణ విద్యా విధానంలో భాగంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. 12వ తరగతి వరకు చాలామంది విద్యార్థులు స్వయంగా పెద్ద మొత్తంలో డబ్బును నిర్వహించే అవకాశం ఉండదని, భవిష్యత్తులో ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు చేతికి వచ్చినప్పుడు దానిని ఎలా సక్రమంగా వినియోగించాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని అన్నారు. స్వతహ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం అమలు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని మరిన్ని పాఠశాలలకు విస్తరించేలా రానున్న రోజుల్లో ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు తమ రెగ్యులర్ డే ప్లాన్, సబ్జెక్ట్ ప్లాన్‌లతో పాటు ఫైనాన్షియల్ లిటరసీకి కూడా ప్రత్యేక సమయం కేటాయించాలని కలెక్టర్ సూచించారు. హెడ్‌మాస్టర్లు ఈ కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే భాషలో రూపొందించిన పుస్తకాలు, బోధనా సామగ్రి వెనుక ఎంతోమంది కృషి ఉందని, వాటిని విద్యార్థులకు నాణ్యమైన రీతిలో అందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించినప్పుడు ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం ఏ విధంగా అమలవుతుందో పరిశీలిస్తానని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ బాధ్యతగా తీసుకొని విజయవంతంగా అమలు చేస్తారనే నమ్మకం తనకు ఉందని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, ఏ ఎం వో విద్యా సాగర్, ఆ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సంచార జాతుల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి సారించాలి

**, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి ( విజన్ ఆంధ్ర): ఆగస్టు 31 సంచార జాతుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబనతో పాటు సామాజికంగా గౌరవప్రదమైన జీవనం సాగించేలా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.సంచార జాతుల 75వ విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి చేన్నయ్య తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మహాత్మా జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... సంచార, విముక్త జాతుల చరిత్రను, వారు ఎదుర్కొన్న సామాజిక పరిస్థితులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, గతంలో వివిధ కారణాలతో సామాజికంగా వెనుకబడిన ఈ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా వారి పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. పథకాల ప్రయోజనాలు పొందడంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. సంచార జాతుల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, సమాన గౌరవం లభించినప్పుడే సమగ్ర అభివృద్ధిసాధ్యమవుతుందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. సంచార, విముక్త జాతుల సంక్షేమం కోసం అధికారులు, కుల సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, బీసీ సంఘాల ప్రతినిధులు, సంచార జాతుల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వేయి స్తంభాల దేవాలయంలో ఎమ్మెల్యే నాయిని దంపతుల ప్రత్యేక పూజలు



హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 ( విజన్ ఆంధ్ర ): శ్రావణ బహుళ తృతీయ సోమవారం, సంకట చతుర్థి సందర్భంగా చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.బ్రహ్మ ముహూర్తంలో నిర్వహించిన సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు ఉద్దిష్ట గణపతికి ఆవుపాలు, పెరుగు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సర్వగ్రహ దోష నివారణ, ప్రజల సుఖసంతోషాలను ఆకాంక్షిస్తూ గణనాథునికి ప్రత్యేక పూజలు, నీరాజనం, మంత్రపుష్పాలు సమర్పించారు. శివునికి ప్రీతికరమైన సోమవారం సందర్భంగా రుద్రాభిషేకం, రుద్రాధ్యాయం నిర్వహించి స్వామివారిని సేవించారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సంబంధిత శాఖల సహకారంతో వేయి స్తంభాల దేవాలయం దినదినాభివృద్ధి చెందుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆలయం చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, గార్డెన్ పూర్తయితే పచ్చని చెట్ల మధ్య భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరే అవకాశం కలుగుతుందని అన్నారు. గార్డెన్ నిర్వహణను కూడా నిరంతరం మెరుగ్గా చేపట్టాలని సూచించారు.తృతీయ సోమవారం సందర్భంగా శివభక్తులు, దాతల సహకారంతో పేద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుద్ర సేవా సమితి సభ్యులు పులి రజనీకాంత్, వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉజ్వల కనెక్షన్ ఇచ్చారు.. సిలిండర్ మరిచారు!

**- ఆరు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోని గ్యాస్ ఏజెన్సీ**

**- ప్రజావాణికి 7 శాఖల అధికారుల గైర్హాజరు**

**- చౌటకూరులో ఇళ్ల స్థలాల వివరాలు వెల్లడించాలని వినతి**



చౌటకూర్ ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర ):- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద తమకు గ్యాస్ పొయ్యి, రెగ్యులేటర్, పత్రాలు అందజేసిన అధికారులు.. సిలిండర్ ఇవ్వడం మాత్రం మరిచారని లబ్ధిదారులు ఆరోపించారు. చౌటకూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో బాధితులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని గత ఆరు నెలలుగా పుల్కల్‌లోని భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు వెంటనే సిలిండర్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల గైర్హాజరుపై చర్యలు:మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ, మొత్తం 21 శాఖలకు గాను 14 శాఖల అధికారులే హాజరయ్యారు. ఎక్సైజ్, పంచాయతీరాజ్, నీటిపారుదల, గృహనిర్మాణం, అటవీ, రోడ్లు-భవనాలు (=&బీ), పౌరసరఫరాల శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. డుమ్మా కొట్టిన అధికారుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని నోడల్ అధికారి శంకర్ తెలిపారు. ప్రజావాణిలో ఇతర సమస్యలు:ఈ వారం ప్రజావాణిలో మొత్తం మూడు దరఖాస్తులు అందాయి. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్య: వెండికోల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కనీస మరుగుదొడ్ల వసతి కల్పించాలని గ్రామస్తులు అర్జీ ఇచ్చారు. ఇళ్ల స్థలాల వివరాలు కావాలి: చౌటకూర్ పంచాయతీ పరిధిలో నిరుపేదలకు కేటాయించిన ప్రభుత్వ ఇళ్ల స్థలాల లబ్ధిదారుల పూర్తి వివరాలను పంచాయతీకి అందజేయాలని సర్పంచ్ పార్కల రాంరెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు అధికారులను కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

**- సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**



నిజామాబాద్ ఆగస్టు31:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాదులోని బీబీనగర్ లో గల ఏయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్ లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ఓసి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వారి సేవలను కూడా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, రాజేందర్, విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయం ముట్టడికి యత్నం

**-కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని యూత్ కాంగ్రెస్ డిమాండ్**



హైదరాబాద్: ఏ ఐ సి సి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పై, బీహార్ లో విద్యార్థులపై బీజేపీ వ్యవహరించిన తీరును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం అబిడ్స్ లోని బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఇటీవల ఒక దేవాలయంలోకి వెళ్లి వస్తే ఆ దేవాలయాన్ని బిజెపి పార్టీ నాయకులు శుద్ధి చేయడం పై మండిపడ్డారు. బీహార్ లో విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళితుల పట్ల, విద్యార్థుల పట్ల బిజెపి వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. బిజెపి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న గేటుకు నల్ల రంగు పూసి కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు యూత్ కాంగ్రెస్ శ్రేణులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే యూత్ కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కో ఇంచార్జ్ లు రోషిని జైస్వాల్, భవ్య, శక్తి సూపర్ షి రాష్ట్ర సమన్వయకర్త విద్యా రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, తేజ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

## !! గూడుకోసం నిరుపేద కుటుంబం ఎదురు చూపు !!

**- ఆశల వలయంలో నిరుపేద కుటుంభం.**

**- ఇందిరమ్మ ఇల్లు మంజూరైన కట్టుకోలేని దీనస్థితి.**

**- రేకులతో ప్రహరీ నిర్మించుకొన్న ఇంటిలో భయంతో బిక్కు బిక్కుమంటూ జీవనం గడుపుతున్న నిరుపేద కుటుంభం.**

**- దాతల కోసం నిరుపేద కుటుంబం ఎదురు చూపు.**



నందిగామ:ఆగస్టు 31(విజన్ ఆంధ్ర న్యూస్); ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన నిరుపేద కుటుంబాల దీనస్థితి,జీవనశైలి మాత్రం మారడం లేదు. రెక్కడితేనేగానీ డొక్కాడని ఒక నిరుపేద కుటుంబం గూడుకోసం ఎదురు చూస్తూ, భయం గుప్పిట్లో జీవనం సాగిస్తున్న సంఘటన మామిడిపల్లి గ్రామంలో వెలుగు చూసింది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామపంచాయతి పరిదిలోగల, దేవుని మామిడిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గడ్డం పూజిత - వంశీ దంపతులు. భార్య గృహిణి,భర్త పెయింటింగ్ వృత్తి,చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ ఇల్లు పూర్తిగా శిథిలావస్థలో ఉండటంతో ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నారు. వారి పరిస్థితి చూసి అధికారులు,పాలకులు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేశారు. కానీ నిరుపేద కుటుంబంలో వచ్చిన సమస్యల వల్ల వారి పరిస్థితి మరింత సమస్యల్లో కూరుకుపోయింది. ఇంటిని నిర్మించుకునే స్థోమత లేకపోవడంతో గత ఐదు సంవత్సరాలుగా రేకులతో ప్రహరీ నిర్మించుకొన్న ఇంటిలో బిక్కు బిక్కుమంటూ జీవనం కొనసాగిస్తునట్లు పేద కుటుంబ సభ్యులు తెలిపారు. ఎవరైనా దాతలు మా పేద కుటుంబంపై దయ తలచి సహాయ, సహకారాలు అందిస్తే సొంతింటి కలను నిజం చేసుకుంటామని "విజన్ ఆంధ్ర" దినపత్రిక ప్రతినిదితో వారి గోడును వెళ్లబోసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు,స్వచ్ఛంద సంస్థలు స్పందించి, నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలని వేడుకుంటున్నారు.

# ఆధారాలతోనే 22ఏ నిర్ణయాలు!!

**- 22ఏ జాబితాలో స్పష్టత ఉండాలి**

**- ప్రైవేట్ భూముల సమస్యలకు పరిష్కారం**

**- ప్రభుత్వ భూములపై రాజీ లేదు**

**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): 22ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, హక్కు పత్రాలను సమగ్రంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి రెవెన్యూ అధికారులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. 22ఏ జాబితాలో భూముల చేర్పు, తొలగింపు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, రికార్డుల పరిశీలనపై అధికారులతో చర్చించారు. ప్రైవేట్ భూములు పొరపాటున నిషేధిత జాబితాలో చేరినట్లు తేలితే వాటిని సర్వే నంబర్ల వారీగా గుర్తించి డిలీటెడ్ లిస్ట్ రూపొందించాలని సూచించారు. అనంతరం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. భూమిని జాబితా నుంచి తొలగించే సమయంలోనూ చేర్పు ప్రక్రియలో పాటించే నిబంధనలను ఖచ్చితంగా అనుసరించాలని తెలిపారు. ప్రజలు 22ఏ భూముల సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు వేగంగా స్పందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఫిర్యాదును రికార్డుల ఆధారంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు కారణాలు, సంబంధిత వివరాలతో స్పష్టమైన రిమార్క్స్ నమోదు చేయాలని ఆదేశించారు. నిజమైన ప్రైవేట్ భూములకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా, గరిష్ఠంగా 48 గంటల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో 22ఏ భూముల పరిశీలన, తొలగింపు ప్రక్రియకు ఒకే విధమైన ఫార్మాట్‌ను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ గంగయ్య, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయండి



నిజామాబాద్ ఆగస్టు31:( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ నగరంలో సోమవారం రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల ప్రోగ్రాం అధికారులు మరియు డిప్యూటీ డిఎంహెచ్వో లకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. డి ఎం హెచ్ ఓ ఛాంబర్ లో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ట్రైనీ కలెక్టర్ సురేష్ పామూరి హాజరైనట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పాఠశాలలో కళాశాలలో ఆరోగ్యం పైన అవగాహన కలిగించాలని, జీవనశైలి వ్యాధులపై, క్యాన్సర్ పై అవగాహన కలిగిస్తూ ఊబకాయానికి గురికాకుండా చూడాలని కాలేజీలలో మిస్టర్ అండ్ మిస్ట్రెస్ లను ప్రోత్సాహిస్తూ మారతాను రన్నింగ్ కాంపిటీషన్లను నిర్వహించాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతుల ను ప్రోత్సాహంగా అందించాలన్నారు. టీబీ ఎంబీఏ లో భాగంగా ప్రతి కుటుంబాన్ని, డ్వాక్రా మహిళలను, బీడీ వర్కర్లను ప్రభుత్వ ఆధీనంలోని వి ఏ ఓ లు ,విలేజ్ సెక్రటరీలను, మెప్మా మెంబర్లను ఉపయోగించి కౌన్సెలింగ్ మరియు అవగాహన కలిగించాలన్నారు. డిఆర్డిఏ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ, వివిధ శాఖల సమన్వయంతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. అదేవిధంగా మెడికల్ కాలేజ్ విద్యార్థులతో ప్రతి మండలంలో హెచ్ఐవి ఎయిడ్స్ పైన అవగాహన కలిగించాలని అన్నారు. ఆశ కార్యకర్తల్లో ఆరోగ్యంపై అవగాహన విస్తృతంగా కలిగించి వారి సేవలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. పూర్తి వ్యాధి నిరోధక టీకలను 100% ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఎక్కడైతే వ్యాధి నిరోధక టీకాలకు వ్యతిరేకత ఉన్నదో అక్కడ వారికి విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు డెంగీ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందు బాటులో ఉన్న ఔషధాలపై విస్తృతంగా అవగాహన కలిగించాలని, వైద్య ధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. వైద్యాధికారులకు నెలకోసారి ఫిజికల్ సమావేశం నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేసినప్పుడే తేరిసియరి ఆరోగ్యం పై భారం పడదన్నారు. మానవతా దృక్పథంతో పనిచేస్తూ కొత్త దనాన్ని, సృజనాత్మకత దృష్టితో సాధారణ సేవలకు భిన్నంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. మాతాశిషూ మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా జరిగితే ఎందుకు జరిగినాయి అని కారణాలను వెతికి అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఅన్ని జాతియా ఆరోగ్య కార్యక్రమాలపై డిఎంహెచ్ఓ రాజశ్రీ మేడం వివరించడమే కాకుండా ప్రోగ్రాం అధికారులు వారి వారి కార్యక్రమాలపై వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిటిసి ఓ డాక్టర్ బేబీ నాగేశ్వరి, డి ఐ ఓ డాక్టర్ అశోక్, ఏఓ సుమంత్ కుమార్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ విద్య, సికందర్ నాయక్, డాక్టర్ రవీందర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న డాక్టర్ అంజన, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శిఖర, డాక్టర్ నవ్య, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ భార్గవి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ కీర్తన, ఎస్ఓ రాజేశ్వర్ , ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ,డిపిఓ విశాల, డిహెచ్ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ధన దాహానికి సామాన్యులు బలి

**- 10,332 ఇళ్లను 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చిన మంచిర్యాల ఎమ్మెల్యే.**

**- 22a ఇళ్లను నిషేధ జాబితా నుండి తొలగించుకుంటే ఉద్యమ ఉధృతంచేస్తాం**

**- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్**



మంచిర్యాల టౌన్ ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) 22 ఏ నిషేధిత జాబితాలో మంచిర్యాల ప్రజల ఇళ్లను తొలగించాలని జాయింట్ కలెక్టర్ వినతిపత్రం అందజేసిన నడిపెల్లి విజిత్ కుమార్ వినతి పత్రం ఇచ్చిన అనంతరం వారు మాట్లాడుతూ. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ మరియు మంచిర్యాల మొత్తం కలిపి 10,332 ఇళ్లను నిషేధిత జాబితాలో అని తెలిపారు ముఖ్యంగా మంచిర్యాల పట్టణంలోని రెడ్డి కాలనీలో దాదాపుగా 500 నివాస గృహాలు, మంచిర్యాల మార్కెట్ ఏరియాలోని. సర్వేనెంబర్ 87 లో 120 ఎకరాల స్థలంలో గత 50 సంవత్సరాల నుండి మున్సిపల్ పర్మిషన్ తీసుకొని ఇంటి నెంబర్ లు పొంది మున్సిపల్ టాక్స్ చెల్లించటం జరుగుతుంది అన్నారు. కొంత మంది తమ ఇంటి స్థలాలను గత ప్రభుత్వాలు ప్రకటించిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం క్రింద రెగ్యులరైజేషన్ చేసుకున్నారు మరియు ఇట్టి స్థలాలు ఆర్ ఓ ఆర్ యాక్ట్ కింద అప్పటి తహసిల్దార్ ఇంప్లిమెంటేషన్ చేశారు మంచిర్యాల కార్పొరేషన్ పరిధి లోని నస్పూర్, మంచిర్యాల మార్కెట్ ఏరియా,జన్మభూమి నగర్,రామ్ నగర్, గర్మిళ్ల, హమాలీవాడ, దొరగారిపల్లి లో అన్ని అనుమతులు ఉన్న పట్టా భూములు కలిగి,ఇల్లు నిర్మించుకున్న, అన్ని ప్రభుత్వ అనుమతులు పొందిన కూడా నిషేధిత జాబితాలో ప్రకటించడం జరిగిందని NTR నగర్, తిలక్ నగర్,రాజీవ్ నగర్, అండాలమ్మ కాలనీ ప్రజలకు గత ప్రభుత్వాలు పట్టాలు మంజూరు చేశారు ఇప్పుడు 22A కింద నిషేధిత జాబితాలో ప్రకటించడం జరిగింది. ఇట్టి 22 ఏ జి ఓ వలన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు అని అన్నారు. ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టిన ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలు పంచుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మరియు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని హెచ్చరించారు వెంటనే 22 ఏ నిషేధిత జాబితా నుండి ఇల్లను తొలగించాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ప్రజల కోసం పోరాడుతుందని తెలిపారు. అదేవిధంగా 22 ఏ నిషేధిత జాబితా నుండి ప్రజల ఇళ్లను తొలగించకపోతే ఎమ్మెల్యే ఇళ్లను సైతం బాధితులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# మహబూబ్ నగర్ లో కిషన్ రెడ్డి పర్యటన
# తెలంగాణకు కేంద్రం వరాల జల్లు

**42 స్టేషన్లకు మహర్దశ - బుల్లెట్ రైలుతో తెలంగాణలో సరికొత్త అధ్యాయం**




మహబూబ్ నగర్,ఆగస్ట్ 31, విజన్ ఆంధ్ర: తెలంగాణ రైల్వే రూపురేఖలు మారబోతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రకటించారు. మహబూబ్ నగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికే పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరగని అభివృద్ధి గత 10 ఏళ్లలో జరిగిందని ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో 42 రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ప్రతి స్టేషన్ ను విమానాశ్రయాన్ని తలపించేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. అందులో భాగంగానే షాద్ నగర్, జడ్చర్ల, గద్వాల, మహబూబ్ నగర్ స్టేషన్లు సరికొత్త రూపు సంతరించుకుంటున్నాయని తెలిపారు. సికింద్రాబాద్ - మహబూబ్ నగర్ డబ్లింగ్ లైన్ పనులు పూర్తయ్యాయని, మహబూబ్ నగర్ నుంచి కర్నూలు వరకు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, దేవరకద్ర - కృష్ణ మధ్య కొత్త లైన్ వేశామని వెల్లడించారు. నిధుల విషయంలో కూడా కిషన్ రెడ్డి కీలక లెక్కలు చెప్పారు. 2014లో ఉమ్మడి ఏపీకి ఏడాదికి రూ. 886 కోట్లు ఇస్తే, ఇప్పుడు కేవలం తెలంగాణకే రూ. 5,454 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి 5 వందేభారత్ రైళ్లు ఇచ్చామని, హైదరాబాద్ నుంచి తిరుపతి, వైజాగ్, నాగ్ పూర్ లకు వీటిని నడుపుతున్నామని అన్నారు. తెలంగాణకు బుల్లెట్ రైలు రాబోతోందని, ఇది తెలంగాణ చరిత్రలో సువర్ణాధ్యాయం కానుందని కిషన్ రెడ్డి ప్రకటించారు. దేశంలో 7 బుల్లెట్ రైళ్లు ప్రకటిస్తే అందులో 3 తెలంగాణకే ఇవ్వడం మోదీకి తెలంగాణపై ఉన్న ప్రేమకు నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ - చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ వస్తే పరిశ్రమలు, పర్యాటకం భారీగా పెరుగుతుందని, కాజీపేటలో అంతర్జాతీయ స్థాయి రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ప్రమాదాల నివారణకు కవచ్ వ్యవస్థను తీసుకొస్తున్నామని చెప్పారు.

## సంచార తెగల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్.**



నిర్మల్ జిల్లా,ఆగష్టు 31,(విజన్ ఆంధ్ర); జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంచార జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వెనుకబడిన సంచార, విముక్త తెగల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. సంచార జాతుల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వాలు అందించే పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు. సంచార జాతుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ సమాజంలో వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 31,(విజన్ ఆంధ్ర); ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కిష్టయ్యకు ఘనంగా పదవీ విరమణ సన్మానం

**- ముఖ్య అతిథులుగా డిప్యూటీ కలెక్టర్ పాండు, ఆర్డీవో రమేష్ బాబు**



చౌటకూర్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ కిష్టయ్య పదవీ విరమణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సుదీర్ఘకాలం పాటు రెవెన్యూ శాఖలో సేవలందించిన ఆయన పదవీ విరమణ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ కలెక్టర్ పాండు, ఆర్డీవో రమేష్ బాబు, విశ్రాంత తహసీల్దార్ నామాల కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ పాండు మాట్లాడుతూ.. ఉద్యోగంలో పదవీ విరమణ సహజమైన ప్రక్రియే అయినప్పటికీ, ప్రజలకు అందించిన నిస్వార్థ సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. తహసీల్దార్‌గా కిష్టయ్య తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపారని కొనియాడారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించడం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, భూ సమస్యల పరిష్కారం, ధ్రువపత్రాల జారీ, సంక్షేమ పథకాల అమలులో తహసీల్దార్ పాత్ర కీలకమని అధికారులు పేర్కొన్నారు. కిష్టయ్య తన ఉద్యోగ ప్రస్థానంలో అందించిన సేవలు ఎంతో అభినందనీయమని వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన తహసీల్దార్ కిష్టయ్యను అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈవో, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్థానిక నాయకులు, యువకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారానికి యువత ముందుకు రావాలి..!

**- జిల్లాల వారీగా వివిధ హోదాల్లో పనిచేసేందుకు తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆహ్వానం..!**




కాప్రా/ఆగష్టు 31(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తెలంగాణ రైతు పరిరక్షణ సమితి నిరంతరం కృషి చేస్తోందని సమితి జనరల్ సెక్రటరీ ఇంద్రపాల సత్యనారాయణ తెలిపారు. రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, పంటలు, విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్, సాగునీరు, పంట నష్టం, భూ సమస్యలు తదితర అంశాలపై రైతులకు అండగా నిలిచి, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా సమితి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాలను మరింత విస్తృతంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు తీసుకెళ్లేందుకు జిల్లాల వారీగా, మండలాల వారీగా వివిధ హోదాల్లో బాధ్యతలు చేపట్టి తనతో కలిసి పనిచేసేందుకు రైతు బిడ్డలు, యువతీ యువకులు, సేవాభావం కలిగిన మంచి మిత్రులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం కోసం పనిచేయాలనే ఆసక్తి, సమాజ సేవ పట్ల నిబద్ధత ఉన్న ప్రతి ఒక్కరికీ తెలంగాణ రైతు పరిరక్షణ సమితి స్వాగతం పలుకుతుందని పేర్కొన్నారు. “రైతు సమస్య మన సమస్యగా భావించి, రైతు కోసం కలిసి పనిచేద్దాం. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు ఐక్యంగా కృషి చేద్దాం. రైతు సంక్షేమం, రైతు అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి” అని ఇంద్రపాల సత్యనారాయణ కోరారు.

# దేశభక్తి కవిత్వంతో ఆకట్టుకున్న ములుగు కవి కోన్డే శ్రీనివాస్ కు ఘన సన్మానం




ములుగు ఆగస్ట్ 31;విజన్ ఆంధ్ర ప్రతినిధి : జాతీయ భావాలను, జెండా గొప్పదనాన్ని తన అక్షరాల్లో అద్భుతంగా ఆవిష్కరించిన ములుగు బిడ్డ, ప్రముఖ కవి లికోన్డే శ్రీనివాస్‌లి కు కరీంనగర్ లో ఘన సన్మానం లభించింది. సోమవారం భగవతి స్కూల్స్ లో జరిగిన లి‘జెండా పై కవిరాజు‘లి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో వేదికపై కవి శ్రీనివాస్ ప్రతిభకు ప్రముఖుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. తన కలంతో దేశభక్తిని రగిలిస్తూ, యువతలో జాతీయ స్ఫూర్తిని నింపుతున్న శ్రీనివాస్ రచనలు అభినందనీయమని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి కొనియాడారు. ములుగు గడ్డ నుంచి వచ్చి జాతీయ స్థాయిలో సాహిత్య పరిషత్ వేదికపై గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమని మేయర్, డిప్యూటీ మేయర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్, జాతీయ సాహిత్య పరిషత్ ప్రముఖులు శాలువాతో సత్కరించి పుస్తకాన్ని అందజేశారు. కవి శ్రీనివాస్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# గ్రామపంచాయతీ భవనానికి స్థలం కేటాయించాలి

**- జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కు వినతి**



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర ) : మంచాల మండలం కాగజ్ ఘట్ గ్రామపంచాయతీ నూతన భవనానికి స్థలం కేటాయించాలని గ్రామ సర్పంచ్ బాకారం శిల్పా రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి గ్రామపాలకవర్గ సభ్యులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాకారం శిల్పా రెడ్డి మాట్లాడుతూ....గ్రామానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.20 లక్షలు మంజూరైన నేపథ్యంలో సర్వే నెంబర్ 22లో 1000 గజాల ప్రభుత్వ స్థలాన్ని గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి కేటాయించాలని కోరారు. నూతన పంచాయతీ భవనం లేక పాత భవనంలోనే అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నాని చెప్పారు. సరైన సౌకర్యాలు, వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. పాత భవనంలో సౌకర్యాలు లేక ప్రజలకు సరైన సేవలు అందించలేకపోతున్నామని అన్నారు. కావున ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి 1000 గజాల ప్రభుత్వ స్థలాన్ని పంచాయితీ భవన నిర్మాణానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిధులు మంజూరైన పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం లేక నానా అవస్థలు పడుతున్నామని అన్నారు. కావున అధికారులు స్పందించి సర్వే నెంబర్ 22లో 1000 గజాల ప్రభుత్వ స్థలాన్ని గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి కేటాయించాలని కోరారు. దీనికి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాగజ్ ఘట్ గ్రామ ఉపసర్పంచ్ మైలారం శ్రీనివాస్, వార్డు సభ్యులు కందుకూరి నాగేష్, గ్రామస్తులు దూసరి రజినీకాంత్, వంగలి శ్రీకాంత్, కొప్పు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి చిరస్మరణీయం

**- మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**

**- పాపిరెడ్డిగూడ హైస్కూల్ హెచ్ఎం కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం**



రంగారెడ్డి బ్యూరో, ఆగష్టు 31(విజన్ ఆంధ్ర ): పాపిరెడ్డిగూడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలం పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరై పదవీ విరమణ చేస్తున్న హెచ్ఎం శ్రీశైలంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా శ్రీశైలం అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు కాదని, జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ, శ్రీశైలం గారు భవిష్యత్తులో మరింత సంతోషంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శశిరేఖ యాదయ్య, మహిళా అధ్యక్షురాలు రాణి, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయులు కోప్పునూరి శ్రీశైలంకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైల్వే హబ్ గా గద్వాల జిల్లా అభివృద్ధి

**- గద్వాలలో మరో ఆర్ఓబి నిర్మాణానికి రూ.66 కోట్ల నిధులు**

**- అమృత్ భారత్ పథకం రూ.42.82 కోట్ల నిధులతో గద్వాల స్టేషన్ అభివృద్ధి**

**- శరవేగంగా గద్వాల రైల్వే స్టేషన్ ఆధునీకీకరణ పనులు**

**- గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు కృషి**

**- కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి**



గద్వాల ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర బ్యూరో) : అమృత్ భారత్ పథకం ద్వారా మంజూరైన రూ.42.82 కోట్ల నిధులతో గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం గద్వాల రైల్వే స్టేషన్ లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర మంత్రి పరిశీలించారు. స్టేషన్ కు చేరుకున్న అతిధులకు అధికారులు, పలువురు నేతలు మేళ తాళాలతో, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా స్టేషన్ అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. ప్లాట్ ఫామ్ పై తిరుగుతూ తుంగభద్ర ఎక్స్ప్రెస్ రైల్లోనీ ప్రయాణికులకు అభివాదం చేశారు. అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైనుంచి స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న వివిధ పనులను గమనించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గద్వాల రైల్వే స్టేషన్ లో అమృత్ భారత్ పథకం పనులు పూర్తయితే ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న రైళ్లకు అదనంగా ఇతర రైళ్ల స్టాపింగ్ కు కృషి చేస్తానన్నారు. స్టేషన్లో ప్లాట్ఫార్మ్ విస్తరణ, పార్కింగ్ అభివృద్ధి, నూతన పరిపాలన భవనం, గద్వాల సంస్థానం సంస్కృతి, చరిత్రను ప్రతిబింబించేలా ముఖద్వారా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. స్టేషన్ వెనుక వైపు నుంచి కూడా రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులకు సౌకర్యంగా మరో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైల్వే హబ్ గా జోగులాంబ గద్వాల జిల్లా అభివృద్ధి చెందుతుందనటంలో అతిశయోక్తి లేదన్నారు. గద్వాల రైల్వే స్టేషన్ ప్రారంభమై వందేళ్లు దాటడంతో అమృత్ భారత్ పనులు పూర్తయ్యాక జిల్లా ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైల్వేకు సంబంధించి గడిచిన 10 ఏళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వసతులను ప్రయాణికులకు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి అప్పటి ప్రభుత్వాలు ఏడాదికి రూ.886 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 2025-2026 సంవత్సరానికి రూ.5454 కోట్ల నిధులను ఒక్క తెలంగాణకే కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 2009-2014 సంవత్సరాల మధ్యన కేవలం 87 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు జరిగితే ప్రస్తుతం 888 కిలోమీటర్ల లైనింగ్ పనులు చేపట్టడం గర్వకారణమన్నారు. 21 రైల్వే ప్రాజెక్టులకు రూ.50 వేల కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. గత పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో 520 ఆర్ఓబి, ఆర్యుబి నిర్మాణాలను పూర్తి చేసామని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4883 కోట్ల నిధులతో 118 రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు చేస్తున్నామన్నారు. గద్వాలలో రూ.66 కోట్ల నిధులతో మరో ఆర్ఓబి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో 99 శాతం రైల్వే ట్రాక్స్ ను విద్యుద్దీకరించడం జరిగిందని, 100 కొత్త రైళ్లను ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 174 రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు ఉచితంగా హై స్పీడ్ వైఫై సౌకర్యాన్ని కల్పించామన్నారు. కాజీపేటలో నూతన సాంకేతికతను వినియోగించి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా రైళ్ల బోగీల తయారీ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. రైల్వే ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోందని, దేశవ్యాప్తంగా కవచ్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ ఏడు బుల్లెట్ రైళ్లను ప్రకటిస్తే అందులో తెలంగాణ రాష్ట్రానికే మూడింటిని కేటాయించడం గర్వకారణంగా ఉందన్నారు. వీటిని హైదరాబాదు నుంచి పూణే, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు నడపడంతో రాష్ట్రం గేమ్ చేంజర్ గా మారుతుందని చెప్పారు. హై స్పీడ్ రైల్ ఎలివేటెడ్ క్యారిడార్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, దాంతో వివిధ ప్రాంతాలకు తక్కువ సమయంలోనే ప్రయాణికులు రాకపోకలు సాగించే వెసులుబాటు కలుగుతుందని ఫలితంగా హైదరాబాద్ కు ప్రపంచవ్యాప్త పెట్టుబడులు పెరుగుతాయని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ అలంపూర్ ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసిందని, ఫలితంగా భక్తుల సంఖ్య కూడా పెరగడంతో క్షేత్ర విశిష్టత ఇనుమడిస్తుందన్నారు. విమానాశ్రయాలను తలపించేలా గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వందేళ్లు పూర్తి చేసుకున్న గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. గద్వాల రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే అన్ని రైళ్లు ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గద్వాల - డోర్నకల్, మాచర్ల - గద్వాల రైల్వే లైన్ పనులు కూడా త్వరలోనే ప్రారంభమయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. డబ్లింగ్ పనులు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీ పేర్కొన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాల సంస్థానాధీశులు ఇక్కడ రైల్వే స్టేషన్ నిర్మాణానికి 100 ఎకరాలకు పైగా స్థలాన్ని కేటాయించడంతో మిగిలిన స్థలంలో భవిష్యత్తులో రైల్వే ప్రాజెక్టులను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గద్వాల పేరు చెప్పగానే మొదట ఇక్కడి చేనేత జరీ చీరలు గుర్తొస్తాయని, రైల్వే కనెక్టివిటీ సౌకర్యాలు మెరుగుపడితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గద్వాల జిల్లా కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ అంతర్ రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రైల్వే స్టేషన్ వెలుపల ఉన్న వాహనాల పార్కింగ్ స్టాండ్ లో ప్రయాణికుల నుంచి అధిక రుసుములను వసూలు చేయడం తగదని, తగ్గించాల్సిందిగా రైల్వే అధికారులను కోరారు. గద్వాల రైల్వే స్టేషన్ లో అన్ని రైళ్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకునేలా స్టాపింగ్ ఉండాలని, ఆధునీకరణకు నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్రమంత్రికి అందజేశారు. అలాగే పలువురు ప్రజాసంఘాల నేతలు గద్వాల ప్రాంత అభివృద్ధిని కోరుతూ మంత్రికి వినతి పత్రాలను అందించారు. ఈ పర్యటనలో రైల్వే డిఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

**- శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల బాలుర, బాలికల హాస్టల్ భవనాలకు శంకుస్థాపన**

**- రూ.14.56 కోట్లతో నిర్మాణాలు.. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): హుస్నాబాద్ నియోజకవర్గాన్ని విద్యా కేంద్రంగా, ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల బాలుర, బాలికల హాస్టల్ నూతన భవనాలకు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఒక్కో హాస్టల్ భవనానికి రూ.7.28 కోట్ల చొప్పున మొత్తం రూ.14.56 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణాలను చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాల భవనాలకు శంకుస్థాపన చేశామని, తాజాగా విద్యార్థుల వసతి కోసం హాస్టల్ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఏడాది లోపు భవన నిర్మాణాలు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం

ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభమైన తొలి సంవత్సరంలో 240 మంది విద్యార్థులకు అవకాశం ఉండగా, 60 మంది విద్యార్థులు చేరారని మంత్రి తెలిపారు. వారికి సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు అందించామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కళాశాలలో రాజకీయ జోక్యానికి తావులేకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండో సంవత్సరంలో 120 మంది విద్యార్థులు చేరారని, రానున్న విద్యా సంవత్సరంలో కళాశాల పూర్తి స్థాయి సామర్థ్యంతో కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. కళాశాల హాస్టల్‌లోనే లైబ్రరీ ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు.

త్వరలో రెండు బస్సులు

శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు త్వరలో రెండు బస్సులు అందుబాటులోకి రానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అప్పటివరకు విద్యార్థుల రవాణా సమస్యలను పరిష్కరించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించేందుకు కూడా దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా స్థానిక ఎమ్మెల్యేగా మాత్రమే కాకుండా విద్యా గార్డియన్‌గా అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యా సంస్థలకు పెద్దపీట

హుస్నాబాద్ పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రాంతానికి ఒక యూనివర్సిటీ రావాలనే ఆకాంక్ష వ్యక్తమైందని మంత్రి గుర్తుచేశారు. అనంతరం హుస్నాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాల అవసరమని ప్రతిపాదనలు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపల్లికి వచ్చిన సమయంలో శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరగా, ముఖ్యమంత్రి వాటిని మంజూరు చేస్తామని ప్రకటించారని చెప్పారు. అనంతరం కేబినెట్ ఆమోదం, స్థల కేటాయింపు, భవన నిర్మాణాలకు నిధుల మంజూరు వంటి ప్రక్రియలను పూర్తి చేశామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యారంగానికి మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు. కోహెడ-తంగళ్లపల్లి ప్రాంతంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. సైదాపూర్‌లో మరో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, భీమదేవరపల్లి మండలంలో నవోదయ పాఠశాల, చిగురుమామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఎల్కతుర్తిలో బాసర ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. ఇప్పటికే ఏటీసీకి శంకుస్థాపన చేశామని, హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేయడంతో పాటు మంచి స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తామని తెలిపారు.

మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు

హుస్నాబాద్ ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ పార్క్, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎల్లమ్మ చెరువు గ్లాస్ బ్రిడ్జికి విస్తృత ప్రచారం లభించడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారని తెలిపారు. పందిళ్ల నుంచి ఎల్లమ్మ చెరువు వరకు, మల్లెచెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు వైపు రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాలకు అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో పాటు వీధి దీపాల ఏర్పాటు చేపడతామని తెలిపారు. పోతారం నుంచి నాగారం మీదుగా కళాశాల వరకు కూడా స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. హుస్నాబాద్ ప్రాంత విద్యార్థులు స్థానికంగానే ఉన్నత విద్యను అభ్యసించి, మంచి ప్లేస్‌మెంట్లతో ఉద్యోగాలు సాధించేలా మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని పూర్తి స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్‌కుమార్, రిజిస్ట్రార్, కళాశాల ప్రిన్సిపల్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉన్నత విద్యా జర్నల్‌కు అంతర్జాతీయ గుర్తింపు

**- ఉన్నత విద్యలో తెలంగాణ మరో కీలక ముందడుగు**

**- ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి**

**- చైర్మన్, తెలంగాణ ఉన్నత విద్యామండలి**




విజన్ ఆంధ్ర (31) హైదరాబాద్ : తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రతిష్ఠాత్మకంగా ప్రచురిస్తున్న తెలంగాణ ఉన్నత విద్యా జర్నల్కు ముద్రిత సంచికకు అంతర్జాతీయ ప్రామాణిక సంఖ్య లభించింది, ఇప్పటికే ఉన్న ఆన్‌లైన్ సంచిక ప్రామాణిక సంఖ్యకు అదనంగా ముద్రిత సంచికకు కూడా అధికారిక గుర్తింపు లభించింది, అంతర్జాతీయ ప్రామాణిక సంఖ్య కేంద్రం ధ్రువీకరణతో జర్నల్ ముద్రిత, ఆన్‌లైన్ సంచికలు అంతర్జాతీయ ప్రామాణిక సంఖ్యల నెట్‌వర్క్‌లో అధికారికంగా నమోదయ్యాయి, అంతర్జాతీయ సమీక్షిత ద్వైవార్షిక జర్నల్‌గా ఇది ఏడాదిన్నర కాలంగా నిరంతరంగా ప్రచురిత మవుతోంది, ఇప్పటివరకు వెలువడిన మూడు సంచికల్లో సాంకేతికత ఉన్నత విద్య, ఉన్నత విద్య అంతర్జాతీయాకరణ, ఇరవై ఒకటో శతాబ్దంలో విశ్వ విద్యాలయాల పునరుద్ధరణ, సంస్కరణలు, భవిష్యత్ ప్రణాళికలు వంటి కీలక అంశాలపై పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురిత మయ్యాయి, రాబోయే సంచికలో కృత్రిమ మేధస్సు ఉన్నత విద్య అంశంపై ప్రత్యేక దృష్టి సారించనుంది, యునెస్కో మద్దతుతో నిర్వహిస్తున్న ఓపెన్ యాక్సెస్ శాస్త్రీయ వనరుల అంతర్జాతీయ జాబితాలోనూ ఈ జర్నల్‌కు స్థానం లభించింది, పలు అంతర్జాతీయ విద్యా, పరిశోధనా వేదికల్లోనూ జర్నల్ అందుబాటులో ఉంది, భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ పరిశోధనా, ఉల్లేఖన డేటాబేస్‌లలో స్థానం సంపాదించే దిశగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చర్యలు కొనసాగిస్తోంది, తెలంగాణ ఉన్నత విద్యను ప్రపంచ స్థాయి విద్యా చర్చల్లో భాగస్వామిగా నిలబెట్టే కృషిలో ఈ జర్నల్ ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తోంది

# మల్కాజిగిరి కార్పొరేషన్ లో ప్రజావాణి

**- టౌన్ ప్లానింగ్‌పైనే ఫిర్యాదుల మోత**

**ప్రజావాణికి 15 దరఖాస్తులు..9 ఆ విభాగానికే**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31: మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించిన ప్రజావాణికి సోమవారం 15 దరఖాస్తులు అందాయి. ఇందులో అత్యధికంగా 9 దరఖాస్తులు టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించినవే కావడం గమనార్హం. ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న పౌర సమస్యలు, మౌలిక వసతులు, పట్టణ ప్రణాళికకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందిన దరఖాస్తులను సంబంధిత విభాగాలకు పంపించిన అధికారులు.. వాటిని నిబంధనల మేరకు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగానికి 3, హార్టికల్చర్ (యూబీడీ) విభాగానికి 2, ఎఫ్.ఏ. విభాగానికి ఒక దరఖాస్తు అందింది. మొత్తంగా 15 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# పేదల గుడిసెలు కూల్చిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మితిమీరిపోతున్న భూకబ్జాదారుల ఆగడాలు
- ప్రభుత్వ భూములను కాపాడాలి
- నర్సంపేట ఆర్డీవోకు ఎంసిపిఐ(యు) నేతల వినతి



నర్సంపేట ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మాదన్నపేట రోడ్డులో సర్వేనెంబర్ 111/1/ 70 లో గత ఐదేళ్లుగా నిరుపేద ఒంటరి మహిళలు వేసుకున్న గుడిసెలను కూల్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఈరోజు నర్సంపేట ఆర్డీవో గారికి ఎంసిపిఐ (యు) నేతలు వినతిపత్రం అందజేశారు .అనంతరం పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ గారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో క్రయ విక్రయాలు జరుపుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నారని .నర్సంపేటలో భూకబ్జా దారుల రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆగడాలు మితిమీరిపోతున్నాయన్నారు .పేదలను నిరాశ్రయులను చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . తక్షణమే ప్రభుత్వ అసైన్డ్ భూములపై విచారణ జరపాలన్నారు. .అన్యాక్రాంతమవుతున్న కబ్జాలను గుర్తించి ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కొత్తకొండ రాజమౌళి ,జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం , కలకోట్ల యాదగిరి కర్నే సాంబయ్య , కేశెట్టి శ్రీనివాస్ భైరబోయిన నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : మంత్రి జూపల్లి

- వారం రోజుల్లోనే అర్జీలను పరిష్కరించాలి
- వాట్సాప్ (81858 85127) ద్వారా అర్జీల స్వీకరణ
- చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 'ఆర్ ఆర్ యాక్ట్' ప్రయోగిస్తాం








వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రతి ఫిర్యాదును వారం రోజుల గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం వనపర్తి జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా, మంత్రి కార్యాలయ వాట్సాప్ నంబర్ 81858 85127 కు దరఖాస్తులు పంపవచ్చని మంత్రి తెలిపారు. కోర్టు పరిధిలోని అంశాలు మినహా మిగిలిన ప్రతి ఫిర్యాదును వారం రోజుల్లోగా పరిష్కరించి అర్జీదారులకు లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే బదిలీ అయినా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై ప్రతి మండలంలో నెలకోసారి ప్రజా ఫిర్యాదులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆక్రమణలపై తీవ్ర ఆగ్రహం చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తీవ్రంగా వ్యవహరించాలని, బాధ్యులపై 'ఆర్ ఆర్ యాక్ట్' ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీపనగండ్లకు చెందిన బీచుపల్లి గౌడ్ భూ సర్వే సమస్యను పరిష్కరించడంలో జాప్యం చేసిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ను ఆదేశించారు. కల్వరాల గ్రామ సర్వే నంబర్ 1 లోని భూమిని సమగ్రంగా సర్వే చేసి, కొంత భాగాన్ని క్రీడా మైదానానికి కేటాయించి మిగిలిన స్థలాన్ని అభివృద్ధి పనులకు ఉపయోగించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక వేగవంతం చేయాలి వీపనగండ్ల మండలానికి కేటాయించిన 375 ఇందిరమ్మ ఇండ్లలో ఇంకా 54 మంది లబ్ధిదారుల ఎంపిక పెండింగ్లో ఉండటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో గ్రామ కమిటీల ద్వారా ఎంపిక పూర్తి చేయాలన్నారు. పొరపాటుగా నా3 జాబితాలో పడిన అర్హులైన వారిని 'హౌశీ నా1 వీశీఎబశ్రీవ' ద్వారా గుర్తించి వారంలోగా కలెక్టర్కు నివేదిక పంపాలన్నారు. నిరుపేదలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇండ్లు నిర్మించేలా చూడాలన్నారు. ప్రాజెక్టులు, ఉపాధి హామీ పనులు సింగోటం గోపాల్ దిన్నె నీటిపారుదల ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేసి అవార్డు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిదినాలు (Man Days) పెంచి లక్ష్యాలను సాధించిన పంచాయతీ కార్యదర్శులకు బహుమ తులు అందజేస్తామన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (SIR) ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. ఏ శాఖలోనైనా అక్రమాలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జెడ్పీ సీఈవో యాదయ్య, స్థానిక సర్పంచ్ పార్వతమ్మ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సామాన్యులకు ఈవీలను అందుబాటులోకి తేవడమే లక్ష్యం



హైదరాబాద్, ఆగస్ట్ 31 (విజన్ ఆంధ్ర) : ఈవీలను సామాన్యులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో ఏథర్ ఎనర్జీ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ 'కోనార్క్'ను 'ఏథర్ కమ్యూనిటీ-డే 2026' నాలుగో ఎడిషన్లో పరిచయం చేసినట్లు ఏథర్ ఎనర్జీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ తరుణ్ మెహతా సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహ వ్యవస్థాపకుడు, సీటీఓ స్వప్నిల్ జైన్ తోకలసి ఆయన మాట్లాడుతూ రోజువారీ రైడింగ్ను సులభతరం చేసేలా కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేశామని తెలిపారు. ఎస్, జెడ్ శ్రేణుల్లో ఆరు వేరియంట్లలో లభించే కోనార్క్ గరిష్ఠంగా 200 కి.మీ. ఐడీసీ రేంజ్ అందిస్తుందని తెలిపారు. కోనార్క్లో ఎఈబిఎస్, మ్యాజిక్కీ, ఆటోపాప్, ఎయిర్వాక్ వంటి అధునాతన ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. సర్వీసింగ్ విరామాన్ని 10 వేల కి.మీకు పెంచగా, ఐదో తరం బెడ్రాక్ బ్యాటరీపై 10 ఏళ్లు/1 లక్ష కి.మీ. వారంటీ అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్ 125, ఎస్ 161 వేరియంట్ల బుకింగ్లు, డెలివరీలు సెప్టెంబర్ మధ్య నుంచి దశలవారీగా ప్రారంభం కానున్నాయని తెలిపారు.

# సామాజిక సేవకై లలితా చౌదరి కి గౌరవ డాక్టరేట్









కాప్రా/ ఆగష్టు 31(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : కాప్రా, మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ విశేష సేవలందిస్తున్న తగిరిశ లలితా చౌదరికి గౌరవ డాక్టరేట్ లభించింది. మహిళల్లో ఆర్థిక చైతన్యం కల్పించడం, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆమె చేస్తున్న సేవలను గుర్తించిన అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ 'ఎక్సలెన్సీ గౌరవ డాక్టరేట్'తో సత్కరించింది. ఇటీవల పాండిచ్చేరిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లలితా చౌదరి గౌరవ డాక్టరేట్ను అందుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు న్యాయవ్యవస్థ మాజీ న్యాయమూర్తి డాక్టర్ కే. వెంకటేశం మాట్లాడుతూ.. నిస్వార్థంగా సమాజ సేవ చేసే వారికి ఎప్పటికైనా తగిన గౌరవం లభిస్తుందని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నరసింహ గౌడ్ హాజరయ్యారు. నిజమైన సామాజిక సేవకులు, కళాకారులు, విద్య, వైద్యం, ఆర్థిక, సాంకేతిక తదితర రంగాల్లో నిస్వార్థంగా సేవలందిస్తున్న వారిని గుర్తించి తమ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్లతో సత్కరిస్తోందని తెలిపారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న లలితా చౌదరి మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించిన యూనివర్సిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నరసింహ గౌడ్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన సేవా కార్యక్రమాలకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ, తనకు సేవ చేసే అవకాశం కల్పించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సేవా రంగంలో లలితా చౌదరి చేస్తున్న కృషికి ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- రేషన్ షాపుల్లో 14 రకాల సరుకులు పంపిణీ చేయాలి
- సీపీఎం ఆధ్వర్యంలో పటాన్చెరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా




పటాన్చెరు ఆగస్టు 31: పటాన్చెరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే. రాజయ్య డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పటాన్చెరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. లిలిఈ సందర్భంగా కే. రాజయ్య మాట్లాడుతూ పటాన్చెరు, రామచంద్రాపురం, బీరంగూడ, అమీన్పూర్ తదితర ప్రాంతాల్లో వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. నెలకు రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు అద్దెలు చెల్లిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో కొల్లూరు, అమీన్పూర్, బీరంగూడ, ముత్తంగి, నాగులపల్లి, కర్దనూర్, పోచారం, చిట్కుల్, కొడకంచి తదితర ప్రాంతాల్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాలను నిర్మించిందని, అయితే కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తికాక మధ్యలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు. నిలిచిపోయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పటాన్చెరు, రామచంద్రాపురం, బీరంగూడ ప్రాంతాలకు చెందిన వేలాది మంది డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని లబ్ధిదారుల జాబితాల్లో పేర్లు ఉన్నప్పటికీ ఇళ్ల కేటాయింపులో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. సంవత్సరాలు గడుస్తున్నా లబ్ధిదారులను అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికాదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకున్న పలువురు లబ్ధిదారులకు రావాల్సిన నిర్మాణ బిల్లులు ఇప్పటికీ చెల్లించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 'ఇందిరమ్మ టవర్స్' పథకానికి సంబంధించి పటాన్చెరు నియోజకవర్గంలో విధివిధానాలను స్పష్టంగా ప్రకటించి, లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడంతో పాటు రేషన్ షాపుల్లో 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి బి. నాగేశ్వరరావు, ఏరియా కమిటీ సభ్యులు ఎం.డి. వాజిద్ అలీ, పి. పాండురంగారెడ్డి, సీపీఎం నాయకులు చంద్రకిరణ్ సింగ్, లఖాన్, సదాశివరెడ్డి, సురేందర్, జయరాం, మార్ఫునగర్ అర్జున్, సంతోష్, ఇమ్మానియేల్ బాబు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలంపూర్ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యత

- ఐదవ శక్తిపీఠం విశిష్టతకు అనుగుణంగా జోగులాంబ రైల్వే స్టేషన్ అభివృద్ధి
- శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న
- కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి



అలంపూర్ ఆగస్టు 31( విజన్ ఆంధ్ర బ్యూరో) : అలంపురం శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి, మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ, స్థానిక ఎమ్మెల్యే విజయుడు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అర్చకులు అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మవారి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలంపూర్లోని జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం అభివృద్ధితో పాటు, రైల్వే స్టేషన్ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.6.07 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్న జోగులాంబ రైల్వే స్టేషన్ ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోమవారం సందర్శించారు. ముందుగా రైల్వే స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న దర్శనీయ స్థలాల సమాచారంతో ఏర్పాటు చేసిన బోర్డులను తిలకించారు. ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి స్టాల్ వద్ద నిర్వాహకులతో మాట్లాడి అనంతరం టికెట్ కౌంటర్ వద్ద ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ జోగులాంబ ఆలయ అభివృద్ధికి కేంద్ర పర్యాటక శాఖ ద్వారా ఇప్పటికే రూ.37 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కేంద్ర వెల్లడించారు. ఆలయాల అంతర్గత అభివృద్ధి, సంరక్షణకు కేంద్ర సాంస్కృతిక శాఖ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కూడా అవసరమైన నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలంపూర్ అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ బస్స్టాండ్, బ్రిడ్జి, రోడ్లు తదితర కొన్ని మౌలిక వసతుల పనులు ఇంకా పెండింగ్లో ఉండటం వలన సంబంధిత అధికారులు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఆయా పనులను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. ఆలంపూర్ అభివృద్ధికి సంబంధించిన అన్ని పనులను సమగ్రంగా సమీక్షించి, పెండింగ్లో ఉన్న పనులను గుర్తించి, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ను కేంద్ర మంత్రి కోరారు. ఆలంపూర్ను మరింత అభివృద్ధి చేసి భక్తులు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జోగులాంబ అమ్మవారి శక్తిపీఠానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు వస్తుంటారని తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని రహదారులు, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం, రవాణా తదితర మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలన్నారు. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో ఆధునికీకరిస్తున్నామని, 2027 నాటికి ఈ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆలంపూర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు దాదాపు 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జోగులాంబ అమ్మవారి ఆధ్యాత్మికత, ఆలంపూర్ శక్తిపీఠం విశిష్టత ప్రతిబింబించేలా రైల్వే స్టేషన్ను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే జోగులాంబ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులతో పాటు ఆలంపూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా హైదరాబాద్, కర్నూలు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణలో రైల్వే నెట్వర్క్ను మరింత విస్తరిస్తూ సింగిల్ లైన్లను డబుల్ లైన్లుగా, డబుల్ లైన్లను ట్రిపుల్ లైన్లుగా, అవసరమైన ప్రాంతాల్లో నాలుగు లైన్లుగా అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ డిఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలనలో తెలంగాణలో సంస్కరణల జోరు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో ముందుకు.. రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణలో మా ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే అనేక అభివృద్ధి, సంస్కరణ కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2023 డిసెంబర్ 3న ప్రజలు మాకు పట్టం కట్టారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నామని చెప్పారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.12,075 కోట్ల విలువైన ప్రయోజనం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 580 మండలాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే దిశగాచర్యలుచేపట్టామని, మహిళా సంఘాలను ఆర్టీసీబస్సులనిర్వహణలోభాగస్వాములను చేసి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వాహన సారథి, ఈవీ, స్క్రాప్ పాలసీలతో పాటు చెక్పోస్టుల రద్దు వంటి సంస్కరణలతో రవాణా శాఖను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు.బీసీ సంక్షేమ శాఖలో గురుకులాలు, హాస్టళ్లలో డైట్, కాస్మొటిక్ చార్జీలుపెంచి విద్యార్థులకునాణ్యమైనభోజనంఅందిస్తున్నామని తెలిపారు. కోహెడ, తంగళ్లపల్లి వంటి ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల నిర్మాణం చేపడుతున్నామని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ సకాలంలో అందేలా చర్యలుతీసుకుంటున్నామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తో లక్షలాది కుటుంబాలకు ప్రయోజనంకలుగుతోందని, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, రుణమాఫీ కోసం సుమారు రూ.20 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లకు రూ.35 వేల కోట్లు వెచ్చించినట్లు వివరించారు.వెయ్యి రోజుల పాలనలో సుమారు 72 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు అందించామని తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ అందించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంచేపడుతున్నామని, నియోజకవర్గానికి 5,500 ఇళ్ల చొప్పున నిర్మాణాలుకొనసాగుతున్నాయనిపేర్కొన్నారు.విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమం అనే ఐదు ప్రధాన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించి ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ ఆదాయ మార్గాలను పెంచుకుంటూ మిగిలిన హామీలను కూడా దశలవారీగా



అమలు చేస్తామని స్పష్టం చేశారు.

**గౌరవెల్లి కాలువలు త్వరగా పూర్తి చేసి నీళ్లిస్తాం**

గౌరవేల్లి ప్రాజెక్ట్ కాలువల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, రైతుల సహకారంతో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలను త్వరగా పూర్తి చేసి సాగునీరు అందించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల సహకారంతో ముందుకు సాగుతున్నామనితెలిపారు.పల్లె పల్లెకు పొన్నమన్న.. పల్లె పల్లెలో ప్రజాపాలన' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని పనులు చేపడతామని పేర్కొన్నారు. హుస్నాబాద్ల పరిశ్రమలు, ఎంటర్టైన్మెంట్, పర్యాటక రంగాల అభివృద్ధిపై దృష్టి సారించామని తెలిపారు. ఎల్లమ్మచెరువు వద్ద అర్బన్ ఫారెస్ట్, విద్యారంగంలో యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ కాలేజీ, వైద్య రంగంలో 200 పడకల ఆస్పత్రి, పీజీ కాలేజీ వంటి ప్రాజెక్టులను తీసుకువస్తున్నామని చెప్పారు. కరీంనగర్, అక్కన్నపేట వైపు నాలుగు లైన్ల రహదారుల అభివృద్ధితోపాటుఅక్కన్నపేట మండలంలో ప్రభుత్వకార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఒక్క ఎకరం భూమి కూడా బీడుగాఉండకూడదన్నదే తన లక్ష్యమన్నారు. రైతులు పంటలతో పాటు ఆయిల్పామ్ సాగును చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులకు శాంక్షన్లు తీసుకొచ్చి, వాటిని అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రి, ఇంజనీరింగ్ కాలేజీ, ఇంటిగ్రేటెడ్ కాలేజీ, నాలుగు లైన్ల రహదారులు, అర్బన్ ఫారెస్ట్, ఎల్లమ్మచెరువు తదితర పనులు వివిధ దశల్లోకొనసాగుతున్నాయని, మిగిలిన పనులను కూడా వేగవంతం చేసి త్వరగా పూర్తి చేస్తామని అన్నారు.

# 33 ఫిర్యాదులతో ములుగు ప్రజావాణి - భూ సమస్యలే అధికం.



ములుగు ఆగస్టు 31; విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా కలెక్టరేట్ (ఐ.డి.ఓ.సి) సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 33 దరఖాస్తులు వచ్చాయి. అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన డి.ఆర్.ఓ. వి. రవి కుమార్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించడం జరిగిందని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అందిన 33 దరఖాస్తుల్లో భూ సమస్యలకు సంబంధించి 14, ఇందిరమ్మ ఇండ్లకు 04, పెన్షన్లకు 02, ఇతర శాఖలకు సంబంధించినవి 13 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**- ప్రజావాణికి 87 వినతుల స్వీకరణ**



మహబూబ్‌నగర్ ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సత్వరం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని అధికారులు జాగ్రత్తగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, సంక్షేమం, వ్యవసాయం, ఎక్సైజ్, పౌరసరఫరాలు, భూ సర్వేరికార్డులు, గృహ నిర్మాణం, రోడ్లురవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్యఆరోగ్యం, మైనింగ్, అటవీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 87 వినతులను అధికారులు స్వీకరించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన లక్ష్యాలను సమీక్షించుకుని, సాధించిన పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటి, వాటికి జియోట్యాగింగ్ చేయాలని, నాటిన మొక్కల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు శాఖల వారీగా నాటిన మొక్కల పురోగతి వివరాలను ఈ రోజు సాయంత్రంలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, వనమహోత్సవం, భూభారతి, ప్రజావాణి తదితర కార్యక్రమాల అమలుపై శాఖల వారీగా క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రతి జిల్లా అధికారికి కేటాయించిన మండలాలను స్పెషల్ ఆఫీసర్లుగా పర్యవేక్షించాలని, ఆయా మండలాల్లో క్రమం తప్పకుండా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవాలని అన్నారు. ఎం.పి.డి.ఓ లు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, ఎ.పి.ఎం లు, ఎ.పి.ఓ లు తదితర మండలస్థాయి అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, సమస్యలను గుర్తించి సాధ్యమైన మేరకు స్థానికంగానే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాల సాధనపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో వారానికొకసారి సమీక్ష నిర్వహించాలని తెలిపారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యం, ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలిన లక్ష్యం, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చించాలని అన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పనులకు సంబంధించి మండలాల వారీగా గ్రౌండింగ్ కానీ ఇళ్లను గుర్తించి, వాటి నిర్మాణం ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రయోజనాలు అందేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులను కూడా వేగవంతం చేయాలని అన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని, అవసరమైన పనులను గుర్తించి ప్రారంభించాలని సూచించారు. ప్రజావాణి, ఆర్టీఐ దరఖాస్తులు, కోర్టు కేసులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సంబంధించిన అంశాలు తదితర పెండింగ్ వ్యవహారాలను అధికారులు క్రమం తప్పకుండా సమీక్షించుకోవాలని అన్నారు. ప్రతి శాఖలో పెండింగ్ అంశాలను గుర్తించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల పనితీరును ఎప్పటికప్పుడు విశ్లేషించుకుని, అవసరమైన చోట అంతర్‌శాఖల సమన్వయంతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పర్యటించి, ప్రభుత్వ కార్యక్రమాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. నిర్మల, జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 14 వేల కోట్ల రుసుము బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**- జిల్లా పాలనాధికారికి వినతి**



ములుగు ఆగస్టు 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో నిలిచిపోయిన దాదాపు పద్నాలుగు వేల కోట్ల రూపాయల విద్యా రుసుము బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ , బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్య కార్యాచరణ సమితి నాయకులు సోమవారం ములుగు జిల్లా పాలనాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ముప్పై లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రుసుములను ప్రభుత్వం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు కళాశాలల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రుసుములు కట్టలేక చదువులు మధ్యలో ఆగిపోతున్నాయని, కొందరు విద్యార్థులు మనస్తాపంతో ప్రాణాలు తీసుకుంటున్నారని, దీని ప్రభావం కోటి కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని, రుసుములతో సంబంధం లేకుండా విద్యార్థుల అసలు చదువు పత్రాలను కళాశాలలు వెంటనే తిరిగి ఇచ్చేలా ప్రత్యేక ఉత్తర్వు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థులు, ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పసుల సాగర్, జెరిపోతుల కరుణాకర్, చిరంజీవి, రాజశేఖర్, రత్నం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఎస్సైలకు ఘన వీడ్కోలు .



ములుగు ఆగస్టు 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పోలీసు శాఖలో సుదీర్ఘ సేవలందించి పదవీ విరమణ పొందిన కంట్రోల్ రూమ్ ఎస్సై సారమల్లు, ములుగు ఎస్సై ఇమ్మాన్యుయేల్ లకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. అదనపు ఎస్పీ సదానందం శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. 42 ఏళ్ల పాటు అంకితభావంతో పనిచేసిన వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్పీలు రవీందర్, కిశోర్ కుమార్, సీఐ సురేష్, ఆర్ఐలు స్వామి, వెంకటనారాయణ, సంక్షేమ సంఘ అధ్యక్షుడు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



నిజామాబాద్, ఆగస్టు 31 : (విజన్ ఆంధ్ర ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణలో సమన్వయం అవసరం .



ములుగు ఆగస్టు 31;విజన్ ఆంధ్ర ప్రతినిధి : బాలల హక్కుల పరిరక్షణే ప్రథమ కర్తవ్యమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చాముండేశ్వరి దేవి అన్నారు. బాలరక్షా భవన్ లో జరిగిన సమావేశంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పోక్సో చట్టంపై చర్చించారు. బాధిత బాలలకు రక్షణ, న్యాయం అందించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని డీఎస్పీ కిశోర్ కుమార్ తెలిపారు.

# రసరమ్యంగా చారిత్రక నాటకం “సత్యాన్వేషి“ ప్రదర్శన




హైదరాబాద్ ఆగస్టు 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : ప్రముఖ సాంస్కృతిక సంస్థ “కళావిపంచి“ నిర్మాణ సారథ్యంలో ప్రఖ్యాత గోవాడ క్రియేషన్స్ నిర్వహణలో రచయిత చిలువేరు రఘురామ్ రచించి, ప్రముఖ నటుడు, దర్శకుడు, నిర్వాహకుడు ప్రధాన పాత్రలో నటించిన డాక్టర్. వెంకట్ గోవాడ దర్శకత్వం వహించి సుమారు 60 మంది కళాకారుల, సాంకేతిక నిపుణుల ప్రయత్నం తో గొప్ప సందేశాత్మక, చారిత్రక నాటకం “సత్యాన్వేషి“ ని రవీంద్రభారతి, ప్రధాన మందిరం, సైఫాబాద్ హైదరాబాద్ లో బుధవారం నాడు రసరమ్యంగా, అద్భుతంగా ప్రదర్శించి కళాభిమానులు, ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారు. ఈ నాటకం“సత్యాన్వేషి“ అనేది సిద్ధార్థుడు గౌతమ బుద్ధుడిగా మారడానికి ముందు అతని జీవిత అంతర్ముఖ ప్రయాణాన్ని వివరిస్తూ రూపొందించిన ఒక చారిత్రక తెలుగు నాటకం. “సత్యాన్వేషి“ అనేది గౌతమ బుద్ధుడిగా మారక ముందు యువరాజు సిద్ధార్థుని జీవితాన్ని అన్వేషించే ఒక చారిత్రక తెలుగు నాటకం. ముఖ్య కథాంశం ప్రాచీన కపిలవస్తు రాజ్యంలో సిద్ధార్థుడి బాల్యం కపిలవస్తు రాజ్యంలో రాజు శుద్ధోధనుడి ఆధ్వర్యంలో సురక్షితమైన రాజభవనంలో పెరగడం. సత్యం వైపు అడుగులు వేస్తూ మానవ బాధలు, వృద్ధాప్యం, మరణం, సంఘర్షణలను చూసి సిద్ధార్థుడిలో కలిగిన తీవ్రమైన ప్రశ్నలు, పరివర్తన యశోధరతో వివాహం, కుమారుడు రాహుల్ జననం తర్వాత కూడా జీవిత పరమార్థం కోసం, సత్యం కోసం అతను చేసిన అన్వేషణే ఈ ‘సత్యాన్వేషి‘ నాటకం ఇతివృత్తం. ఈ సందర్భంగా నిర్వాహకుడు వెంకట్ గోవాడ నాటకంలో గొప్పగా తమ పాత్రలను పోషించిన కళాకారులను అభినందించి, పాత్రలలో నటించిన అటులను, సాంకేతిక నిపుణులను పరిచయం చేశారు. అతిథులు మాట్లాడుతూ, ఇలాంటి సందేశాత్మక నాటకాన్ని ప్రోత్సహించి, కళాకారులను ఆశీర్వదించాలని ప్రేక్షకులను కోరారు.




తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రఖ్యాత దక్షిణ భారత సాంస్కృతిక సంఘం (ఎస్ ఐ సి ఎ), హైదరాబాద్ నిర్వహణలో ప్రముఖ శాస్త్రీయ సంగీత గాయని, విధుషి డాక్టర్. దుడ్డు రాధిక, దుడ్డు కార్తీక మనస్విని స్వర మద్దత్తుతో ఏర్పాటు చేసిన గొప్ప శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ కార్యక్రమం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, మొదటి అంతస్తు, హైదరాబాద్ లో శనివారం సాయంత్రం సంగీత, సాహిత్య ప్రియులను ప్రేక్షకులను విశేషంగా అలరించింది, ఆకట్టుకుంది.



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, ఆత్మీయ సాంస్కృతిక సమితి తార్నాక, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్. నిర్మల లక్కరాజు రచించిన “విశ్వ నియమాలు – విశ్వ రహస్యాలు పార్ట్ – 2“ గ్రంథం ఆవిష్కరణ మహోత్సవం కార్యక్రమం “రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్, మొదటి అంతస్థు, సైఫాబాద్, హైదరాబాద్ లో బుధవారం నాడు అతిథులు, సాహితీవేత్తలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరిగింది.

# వారం రోజుల్లో రైల్వే భూసేకరణ పూర్తి

**వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌కు వివరించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ – డోన్ మార్గంలో చేపడుతున్న రైల్వే డబుల్ లైన్ ప్రాజెక్టుకు సంబంధించి వనపర్తి జిల్లాలో చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియను వారం నుంచి పది రోజుల్లో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ, రోడ్డు–రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలో రైల్వే విస్తరణ, డబ్లింగ్ ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ పనులపై ఈ సందర్భంగా సమీక్షించారు. రైల్వే విస్తరణకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేసి రైల్వే శాఖకు అప్పగించాలని సీఎస్ కలెక్టర్లను ఆదేశించారు. మహబూబ్‌నగర్ – డోన్ రైల్వే డబులింగ్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో కొంత భాగంతో పాటు, వనపర్తి జిల్లా పరిధిలో 69.09 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఆలస్యానికి గల కారణాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. దీనిపై కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పందిస్తూ... జిల్లాలోని ఆరేపల్లి వద్ద సేకరించాల్సిన 69.09 ఎకరాల్లో ఇప్పటికే 43.34 ఎకరాల భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి అవార్డు పాస్ చేశామని తెలిపారు. బాధితులైన రైతులకు నష్టపరిహారం డబ్బులను కూడా అందజేశామని వివరించారు. మిగిలిన 19.36 ఎకరాల భూసేకరణ పనులను మరో పది రోజుల్లో పూర్తి చేసి భూమిని అప్పగిస్తామని సీఎస్‌కు స్పష్టం చేశారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**- బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బొక్క బాల్‌రెడ్డి**

**- వనపర్తిలో బీజేపీ నిరాహార దీక్ష..**

**- స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడికి హెచ్చరిక**




వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బొక్క బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక కళాశాలల్లో సర్టిఫికెట్లు నిలిచిపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే విద్యార్థులను సమీకరించి రాష్ట్రవ్యాప్త ఆందోళనలతో పాటు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

***ప్రైవేట్ లెక్చరర్ల సంఘం మద్దతు***

ఈ నిరసన కార్యక్రమానికి ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల, నిరుద్యోగుల సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అరవింద్, లెక్చరర్ల సంఘం ప్రతినిధులు వినోద్ కుమార్, రమేష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వివిధ ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



నిజామాబాద్, ఆగస్టు 31 :(విజన్ ఆంధ్ర )రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో కవిత కంటతడి

- ప్రశాంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు
- రాజకీయంగా హీట్ పెంచిన సభ



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, నిజామాబాద్,ఆగస్ట్ 31, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): నిజామాబాద్ గడ్డపై జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. తన రాజకీయ జీవితంలో ఎదురైన ఒడిదుడుకులు, తనకు జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకుంటూ ఆమె కంటతడి పెట్టడంతో సభలో ఒక్కసారిగా ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. అనంతరం ఆమె తన ప్రసంగాన్ని విమర్శలతో హోరెత్తించారు. ప్రధానంగా మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ కవిత నిప్పులు చెరిగారు.

**- "ప్రశాంత్ రెడ్డిది శకుని పాత్ర - తండ్రీకూతుళ్లను విడదీసిన పాపాత్ముడు"**

మహాభారతంలో కౌరవులను, పాండవులను విడదీసిన శకుని పాత్ర ఎలాంటిదో, తెలంగాణ రాజకీయాల్లో వేముల ప్రశాంత్ రెడ్డి పాత్ర అలాంటిదేనని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కన్న తండ్రీకూతుళ్ల మధ్య విభేదాలు సృష్టించి, కుటుంబంలో చిచ్చు పెట్టిన పాపాత్ముడు ప్రశాంత్ రెడ్డేనని ఆమె ఆరోపించారు. ఇలాంటి వ్యక్తికి ఇక ప్రజా జీవితం లేదని, ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**- కాంగ్రెస్ వైపు ప్రశాంత్ రెడ్డి చూపు?**

అంతేకాదు, నిత్యం బీఆర్ఎస్ జెండా మోసిన ప్రశాంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు రహస్యంగా ప్రయత్నాలు చేస్తున్నారని కవిత సంచలన ఆరోపణ చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా చర్చ మొదలైంది.

**- నన్ను అణగదొక్కాలని చూశారు - కవిత ఆవేదన**

తనను రాజకీయంగా ఎదగనీయకుండా బీఆర్ఎస్ లోని కొందరు ఎమ్మెల్యేలే అణగదొక్కే ప్రయత్నం చేశారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డగా తనను ముందుకు రానీయకుండా కుట్రలు చేశారని, అయినా తాను వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

**- నిజామాబాద్ లో 5 సీట్లు మావే - కవిత సవాల్**

తన రాజకీయ భవిష్యత్తుపై కూడా కవిత క్లారిటీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలోని 5 అసెంబ్లీ స్థానాలను తమ ఆధ్వర్యంలో గెలుచుకుని తీరుతామని సవాల్ విసిరారు. ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని, ప్రజల ఆశీర్వాదంతోనే ముందుకు వెళ్తామని ఆమె ప్రకటించారు. కవిత ప్రసంగం ఇప్పుడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.

# సెప్టెంబర్ 16న సీఎం కు కృతజ్ఞత సభ

**- డాక్టర్ పిడమర్తి రవి**

**- ముఖ్యమంత్రికి ఓయూలో పాలాభిషేకం**



తెలంగాణ ఉద్యమకారులకు 250 గజం స్థలం, గుర్తింపు కార్డు, బస్సు పాస్, ఇస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలుపుతూ సెప్టెంబర్ 16న సీఎంకు కృతజ్ఞత సభ నిర్వహిస్తామని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి పాలాభిషేకం నిర్వహించిన అనంతరం డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు గౌరవం దక్కలేదని ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రత్యేక కమిటీ వేసి అనంతరం కేకే కమిటీ ఇచ్చిన నివేదికను ఆధారంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల స్థలం గుర్తింపు కార్డు బస్ పాస్ ఇస్తానని ప్రకటించడం శుభ పరిణామం అని సెప్టెంబర్ 16న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు కృతజ్ఞత సభ నిర్వహిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి రహీం, కన్వీనర్ చందర్ నాయక్, దీక్షా రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, గడ్డ యాదయ్య, కందుల శ్రీను,అందే కృష్ణ, అంజి, నక్క మహేష్, దర్శనం జాన్, మొగిలిగిద్ద ప్రసాద్, దేవరకొండ నరేష్, కల్వకుర్తి శ్రీశైలం, మీసాల మహేష్, శ్రీనివాస్, బొమ్మరిల్లు స్టాలిన్, శివ తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



నిజామాబాద్, ఆగస్టు 31 : (విజన్ ఆంధ్ర ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఇరుముడి - ప్రతి ఇంట్లో చూడాల్సిన చిత్రం.. రవితేజ విశ్వరూపం!

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, ఆగస్ట్ 31,(విజన్ ఆంధ్ర):

సాధారణంగా సినిమా అంటే వినోదం, ఫైట్లు, పాటలు అనుకుంటాం. కానీ కొన్ని సినిమాలు జీవితాలను మార్చేస్తాయి. మనసులను కదిలిస్తాయి. మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 'ఇరుముడి' చిత్రం అలాంటి కోవకు చెందినదే. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఇప్పుడు ప్రతి కుటుంబంలో చర్చనీయాంశంగా మారింది. థియేటర్ నుండి బయటకు వస్తున్న ప్రతి ఒక్కరి కళ్ళల్లో కన్నీరు, మనసులో ఆలోచన కనిపిస్తోంది.

**సినిమా ప్రధాన సందేశం - ఆడపిల్లకు తండ్రే ధైర్యం**

ఈ సినిమాలో దర్శకుడు చెప్పాలనుకున్న అతి పెద్ద పాయింట్ ఒక్కటే - ఆడపిల్ల తనకు జరిగే ప్రతి విషయాన్ని కన్నతండ్రికి చెప్పాలి. సమాజంలో ఆడపిల్లలకు ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. బయట ప్రపంచంలో జరిగే మంచి, చెడు విషయాలను చాలా సార్లు పిల్లలు తల్లిదండ్రులకు చెప్పడానికి భయపడతారు. కానీ కన్నతండ్రికి చెబితేనే ఆ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, తండ్రి అండ ఉంటే ఏ బిడ్డకూ ఏ కష్టం రాదని ఈ సినిమా చాలా బలంగా చెబుతుంది.

**తండ్రీకూతుళ్ల అనుబంధం - సినిమాకే హైలైట్**

సినిమా మొత్తం తండ్రి-కూతుర్ల అనుబంధం చుట్టూనే తిరుగుతుంది. రవితేజ తన కూతురి పట్ల చూపించే ప్రేమ, బాధ్యత, ఆవేదన ప్రతి తండ్రికి తనను తాను చూసుకున్నట్లు అనిపిస్తుంది. తన కూతురికి ఏదైనా జరిగితే ఒక తండ్రి ఎంతలా తల్లడిల్లిపోతాడో, సమాజంతో ఎలా పోరాడతాడో రవితేజ తన నటనతో జీవించేశారు. ఇప్పటివరకు మాస్ పాత్రల్లో చూసిన




రవితేజను ఈ సినిమాలో ఒక ఎమోషనల్ ఫాదర్ గా చూడటం ప్రేక్షకులకు కొత్త అనుభూతి. క్లైమాక్స్ సన్నివేశంలో ఆయన నటనకు థియేటర్ మొత్తం కన్నీరు పెట్టడం ఖాయం.

పిల్లల పెంపకం, బయటి సమాజం - కళ్ళు తెరిపించే నిజం

ఈ సినిమా కేవలం తండ్రీకూతుళ్ల కథ మాత్రమే కాదు.

- నేటి సమాజంలో పిల్లల పెంపకం ఎలా ఉండాలి?
- బయటి ప్రపంచంలో పిల్లలకు ఎలాంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి?
- బంధాలు, అనుబంధాల విలువ ఏంటి?
- ఒక కుటుంబం కలిసికట్టుగా ఉంటే ఏ సమస్యనైనా ఎలా ఎదుర్కోవచ్చు?

వంటి ఎన్నో విషయాలను ఈ సినిమా కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. అందుకే ఈ సినిమా చూసిన తర్వాత ప్రతి ఇంట్లో తండ్రి-కూతుర్ల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని ప్రేక్షకులు తమ అభిప్రాయాన్ని చెబుతున్నారు. ప్రతి ఇంట్లో ఒక ఆడపిల్ల ఉండే విధంగా ఈ సినిమా నుండి నేర్చుకోవాల్సింది చాలా ఉందని వారు ఆవేదనతో చెబుతున్నారు.

**చిన్న అభ్యంతరం**

సినిమా మొత్తం అద్భుతంగా ఉన్నా, కొన్ని చోట్ల విద్యార్థులను, ఉపాధ్యాయులను కించపరిచే విధంగా సన్నివేశాలు ఉన్నాయని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఆయా సన్నివేశాలను తొలగిస్తే సినిమా మరింత పరిపూర్ణంగా ఉంటుందని వారు కోరుతున్నారు.

**ఫైనల్ గా ఒక మాట:**

'ఇరుముడి' అనేది ఒక సినిమా కాదు.. ప్రతి తండ్రి తన కూతురికి, ప్రతి కూతురు తన తండ్రికి చెప్పాలనుకునే ఒక భావోద్వేగ కావ్యం. ఈ సినిమా తప్పక చూడాల్సిన చిత్రం.

# కల్వకుర్తిలో నేడు బోనాల జాతర ఆడబిడ్డల భద్రతపైనే పోలీసుల స్పెషల్ ఫోకస్

**- డీజే కి నో, మహిళలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు**

**- సీఐ భీమ్ కుమార్ స్ట్రాంగ్ వార్నింగ్**



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,ఆగస్ట్ 31,(విజన్ ఆంధ్ర ప్రతినిధి): పట్టణంలో నేడు జరగబోయే బోనాల పండుగకు పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సోమవారం కల్వకుర్తి పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన పీస్ మీటింగ్ లో సీఐ భీమ్ కుమార్, ఎస్సై కురుమూర్తిలి బోనాల నిర్వాహకులకు, యువకులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. బోనాల పండుగను ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని, అయితే నిబంధనలు మాత్రం కచ్చితంగా పాటించాలని సీఐ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఐ భీమ్ కుమార్ మాట్లాడుతూ కీలక హెచ్చరికలు చేశారు. పండుగ సందర్భంగా నిర్వహించే పలారం బండ్లు, తొట్టెల వంటి కార్యక్రమాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా గొడవలకు తావివ్వొద్దని సూచించారు. ముఖ్యంగా ఆడపడుచుల భద్రతపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. రోడ్లపై బోనమెత్తి వెళ్తున్న మహిళలకు, అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే ఆడబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, వారికి ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే బోనాల ఊరేగింపుల పేరుతో రోడ్లను బ్లాక్ చేయవద్దని, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించవద్దని చెప్పారు. బోనాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజే లకు అనుమతి లేదని, పర్మిషన్ ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బోనాలు, ఘట్టాలన్నీ నిర్ణీత సమయంలోపే పూర్తి చేయాలని, ఎక్కడ ఏ చిన్న గొడవ జరిగినా దానికి ఆర్గనైజర్లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఐ, ఎస్సై స్పష్టం చేశారు.

# యంత్రాలకే రక్షణ.. కార్మికుల ప్రాణాలకేంటి!!

**- సింగరేణి యాజమాన్యంపై కార్మికుల, సంఘాల ఆగ్రహం**

**- ప్రచారానికే ప్రాధాన్యమా? కార్మిక ప్రమాదాలపై ఎందుకు మౌనం?**

**- మరణాలు, గాయాలపై దాటవేత ఎందుకు?**

**- సేఫ్టీ ఆడిట్ ఎక్కడ? టార్గెట్ ఒత్తిడితో భద్రతకు తూట్లు?**

**- రూఫ్ బోల్టింగ్‌పై నిర్లక్ష్యమెందుకు?**




పెద్దపల్లి బ్యూరో చీఫ్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర):

సింగరేణిలో యంత్రాలకు చిన్న గీత పడినా, రూఫ్ ఫాల్ జరిగినా క్షణాల్లో పత్రికా ప్రకటనలు విడుదల చేస్తూ "పరిస్థితి అంతా సాధారణం, యంత్రం సురక్షితం" అంటూ ప్రచారం చేసుకునే యాజమాన్యం... కార్మికులు గాయపడినప్పుడో, ప్రాణాలు కోల్పోయినప్పుడో ఎందుకు మౌనం వహిస్తోందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు ఉత్పత్తి, యంత్రాల సంరక్షణపై చూపే శ్రద్ధ కార్మికుల భద్రత, జవాబుదారీతనంపై ఎందుకు ఉండటం లేదని కార్మిక సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి.

***యాజమాన్యం ద్వంద్వ వైఖరిపై ప్రధాన విమర్శలు!!***

***ప్రచారానికే ప్రాధాన్యం***

జీడికే-11ఏ గనిలో కంటిన్యూయస్ మైనర్ పై రూఫ్ పడిన ఘటనపై కొద్ది గంటల్లోనే అధికారిక ప్రకటన జారీ చేసి యంత్రాన్ని కాపాడామని గొప్పలు చెప్పుకుంటున్న అధికారులు, కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం వివరాలను గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు.




*మరణాలు, గాయాల వేళ దాటవేత*

గనుల్లో ప్రమాదాలు జరిగి నిరుపేద కార్మికులు క్షతగాత్రులైనప్పుడు గానీ, మృతి చెందినప్పుడు గానీ యాజమాన్యం తక్షణమే బాధ్యతాయుతమైన సమగ్ర వివరణ ఎందుకు ఇవ్వదు? ప్రాథమిక దర్యాప్తు, అధికారుల నిర్లక్ష్యంపై స్పష్టత ఎందుకు ఇవ్వడం లేదు?

***సేఫ్టీ ఆడిట్ ఎక్కడ?***

ఉత్పత్తి లక్ష్యాల కోసం గనుల్లో సేఫ్టీ నిబంధనలను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సరైన సపోర్ట్ వ్యవస్థలు (రూఫ్ బోల్టింగ్) లేక ప్రమాదాలు జరిగినప్పుడు, దానిని "సహజ సిద్ధంగా జరిగిన భౌగోళిక ఒత్తిడి" అంటూ తప్పించుకునే ధోరణి కనిపిస్తోంది.

***అధికారుల నిర్లక్ష్యంపై చర్యలేవి?***

ప్రమాదం జరిగిన ప్రతిసారీ విచారణ కమిటీల పేరుతో కాలయాపన చేయడం తప్ప, ప్రమాదాలకు కారణమైన ఉన్నతాధికారులపై తీసుకున్న చర్యల వివరాలను పారదర్శకంగా ఎన్నడూ వెల్లడించకపోవడం గమనార్హం. యాజమాన్యానికి కోట్ల విలువైన యంత్రాలు, రోజువారీ ఉత్పత్తి మాత్రమే ముఖ్యం కాదని, ప్రాణాలు పణంగా పెట్టి చీకటి గనుల్లో శ్రమిస్తున్న కార్మికుల భద్రత అంతకంటే ముఖ్యమని కార్మిక లోకం గుర్తుచేస్తోంది. ఇప్పటికైనా యాజమాన్యం ప్రచార ఆర్భాటాలు పక్కనపెట్టి, కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించడంతో పాటు ప్రమాదాల వివరాలను దాచకుండా పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కుత్బుల్లాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- ద్వారకానగర్‌లో మల్టీపర్పస్ హాల్‌కు రూ.21.50 లక్షలు**

**- వెంకన్నహిల్స్‌లో కురుమ సంఘం శ్మశానవాటికకు రూ.18.50 లక్షలు**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 31 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల సర్కిల్ పరిధిలో రెండు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. 284వ డివిజన్ గణేష్‌నగర్ పరిధిలోని ద్వారకానగర్‌లో మల్టీపర్పస్ హాల్, కుత్బుల్లాపూర్ గ్రామం వెంకన్నహిల్స్‌లో కురుమ సంఘం శ్మశానవాటిక నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి రూ. 21.50 లక్షలు, కురుమ సంఘం శ్మశానవాటిక నిర్మాణానికి రూ. 18.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టనున్న పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ద్వారకానగర్‌లో నిర్మించనున్న మల్టీపర్పస్ హాల్ పూర్తయితే సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణకు స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా వెంకన్నహిల్స్‌లో కురుమ సంఘం శ్మశానవాటిక నిర్మాణం పూర్తయితే స్థానిక కురుమ కులస్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. రెండు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంపై కురుమ సంఘం కమిటీ సభ్యులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు చొరవ చూపిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు, అభివృద్ధి పనులకు సహకరిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ కే.ఎం. గౌరీష్, డివిజన్ అధ్యక్షులు, వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, కురుమ సంఘం కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదీ శైలిలో డాబర్ ఇండియా కొత్త ప్రచారం

హైదరాబాద్, ఆగస్ట్ 31 (విజన్ ఆంధ్ర) : డాబర్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఎయిర్ ఫ్రెషనర్ బ్రాండ్ ఓడోనిల్ 'బాత్రూమా మే ఓడోనిల్ నాకో, తో ఆప్కో బద్నామీ హో రహీ హోగీ కహీ' పేరుతో హైదరాబాద్ కేంద్రంగా కొత్త ప్రచార చిత్రాన్ని విడుదల చేసినట్లు డాబర్ ఇండియా హోమ్ కేర్ మార్కెటింగ్ హెడ్ వైభవ్ రాఠీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాదీ హాస్యం, స్థానిక భాష, రోజువారీ సామాజిక పరిస్థితులను మేళవిస్తూ బాత్రూమ్ తాజాదనం ప్రాముఖ్యతను ఈ ప్రచారం చాటి చెబుతోందని అన్నారు. స్థానిక హాస్యం, సంభాషణలు, సామాజిక పరిశీలనలతో హైదరాబాద్ ప్రేక్షకులకు ప్రత్యేకంగా అనుసంధానమయ్యేలా ఈ ప్రచారాన్ని రూపొందించామని తెలిపారు. ఈ ప్రచారం టెలివిజన్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, ప్రాంతీయ కంటెంట్ క్రియేటర్ల భాగస్వామ్యంతో విస్తరించనుందని పేర్కొన్నారు.

# రైల్వే ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**




నిజామాబాద్, ఆగస్టు 31 :(విజన్ ఆంధ్ర )రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ - మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.